

# తప్పిపోయిన పెళ్లికూతురు

## రాధాకృష్ణ

(గత సంచిక తరువాయి)

కొంచెం బద్ధకస్తుడైనా హోటల్ వ్యాపారం కనక మూడుగంటలకల్లా లేచి సరంజాం చేస్తూవుంటాడు వైద్యనాథ అయ్యరు, భార్య కూడా కొంచెం స్థూలకాయురాలైనా 'ఆలశ్యంగా నిద్ర నుంచి లేచేవాడు అష్టాదశ మహాపాపి' అంటూ ఇంటి పనులు తానుకూడా చక చక పూర్తిచేస్తుంది.

దంపతు లిద్దరూ ఈ విధంగా అతి కాయ, మహాకాయులయ్యారు. హోటల్ వ్యాపారంలోని ఆదాయం మాధుర్యాన్ని బాగా చవిచూసినవారు కావటం మూలాన భక్తి, పూజాపునస్కారాలు మొదలైన లక్షణాలకు లోటులేకుండా వర్తిస్తూవుంటారు.

హోటల్ గదులలో బసచేసిన వారింకా లేవకుండానే - కాఫీ గత ప్రాణాలైన ప్రజలు ఇంకా ఎవరూ హోటల్‌లో అడుగు పెట్టకుండానే నరేంద్రలాల్ క్రిందికి దిగివచ్చి,

స్నానంచేసి దుస్తులు వేసుకుని రెండు ఇడ్లీ ఓ కప్పు కాఫీతో ఉదరానికి కొంచెం స్వాస్థ్యం ఇచ్చి, వెంటనే బయలుదేరాడు.

తెల్లవారకుండానే నాయుడు లేస్తాడా, ఎందుకీయనకింత తొందర అనుకున్నాడు వైద్యనాథయ్యర్.

"రెండు వుత్తరాలు అతిజరూరుగా పోస్టులోవేసి, అప్పుడు మళ్ళీ నాయుడు కోసం వెడతా"నని చెప్పి, నరేంద్ర లాల్ తిన్నగా కాలినడకనే నాయుడు బంగళాకు దారితీశాడు.

తొలిరాత్రి కనిపించని నౌకరు ఎవ రైనా కనిపిస్తారేమో అనుకున్నాడు. అంత తోటవున్నప్పుడు తోటమాలి కూడా అక్కడే కాపరం ఉండాలి గదా అయిపూ అంతూలేకుండా నిన్న రాత్రి ఎక్కడికి పోయివుంటాడా అను కున్నాడు.

సైనికుని ఉడుపులలోని వ్యక్తి ప్రహారీగోడను దాటిన చోటుకువెళ్ళి, ఆ ప్రదేశాన్ని పరిశీలించాడు. సైనికులు వేసుకునే జోడు ఆనవాళ్ళు స్పష్టంగా కనిపిస్తున్నాయి. జేబులోని కాగితం, పెన్సిల్ తీసి ఆ జోడు మడత స్కెచ్ గీసుకున్నాడు

తర్వాత మేడ వెనుక భాగానికి వెళ్ళాడు. కొంచెం దూరంలో ఒక పాక కనిపించింది. అక్కడకు వెళ్ళి తలుపు తీసి చూశాడు. తోటమాలి కాబోలు ఒక చాపమీద పడుకొని నిద్ర పోతున్నాడు.

నరేంద్రలాల్ అతణ్ణి లేపాడు. తోటమాలి ఉలికిపడి లేచాడు. ఎదట సూట్‌లోవున్న డిటెక్టివును చూసి "ఎవరు బాబయ్యా" అన్నాడు.

"నాయుడు ఎక్కడ?" అని అడిగాడు డిటెక్టివు.

"మిద్దెపైన వుండారు సామీ."

"నువ్వెప్పుడు చూశావు?"

"నేను చూణ్ణేలేదు మా అత్తవారిం టికిపోయి రాత్రివా వస్తిని."

"రాత్రి ఎన్నింటికి వచ్చావు?"

'ఒంటిగెంట అయివుణ్ణు. ఆయన వస్తురని తెలిస్తే పోయి వుండేవాణ్ణే కాదు!"

"ఆయన మిద్దెమీదవున్నట్లు నీకు ఎలా తెలుసు?"

"తలుపుకు నేను వేసిపోయివ తాళం లేదే! ఆయనకాక ఎవరు వచ్చేది?"

"మీ అత్తగారి ఊరు ఏది?"

"తిరుప్పువనం దొరా" ఈ ప్రశ్నల ధోరణి చూసి అతడు పోలీసు ఉద్యోగస్థుడే ననుకొన్నాడు తోట మాలి."

"సరే. నాతో రా, ఇల్లు కొంచెం సోదా చెయ్యాలి."

"అయ్య వుండారుగా!"

"రావోయి! వచ్చి అయ్యనిచూపు.

నువ్వు ఆత్తారి ఇంటికి వెళ్ళి కూర్చున్నావు. రాత్రి ఇక్కడ ఐలే గలాటా జరిగింది. నీ పేరు ?"

"వీరప్ప."

"అయితే వెళ్ళి మీ అయ్యను లేపి తలుపు తీయించు మరి."

వీరప్ప వీధి తలుపుతట్టాడు. బదులు రాలేదు, గొంతెత్తి పిలిచాడు. సమాధానం లేదు.

వాడి ముఖంలో దిగులు కనిపించింది. యజమానికి ఏదో ప్రమాదం సంభవించి వుంటుందనుకొన్నాడు. ముఖం వెల్లనయింది. కళ్ళనుంచి అప్పుడే...

'రా ఇల్లా' అని నరేంద్రలాలు తోటమాలిని వెంటబెట్టుకొని గతరాత్రి తాను దూకిన కిటికీదగ్గరకు తీసుకువెళ్ళాడు. లోపలకు దూకాడు. తోటమాలిని కూడా లోపలకు రమ్మన్నాడు.

ముందు వీధితలుపు తెరిచాడు. ఆ తర్వాత లోపల గదులు మళ్ళా సోదా చెయ్య నారంభించాడు. కుర్చీలూ, బల్లలూ విరిగిపోయి పడివున్న లైబ్రరీ గదని తోటమాలి చూసి కొయ్యబారి పోయాడు.

తటాలున మేడమీదికి పరిగెత్తి చూచాడు, యజమాని లేడు. అయ్యా అయ్యా అని కేకలు వేశాడు. తోటమాలి కేకలు ప్రతిధ్వనించినవేగాని బదులులేదు. తోటమాలి ఏడవనారంభించాడు.

నరేంద్రలాల్ ఊరుకోమంటే, మొత్తుకోసాగాడు. ఒక్క గదుముతో వాని ఏడుపును తగ్గించి వంటగదిని పరకాయించి చూశాడు. ఆ గది నాను కాని మరో గది వుంది. గొళ్ళెం తీసి ఆ గది తలుపు త్రోశాడు.

కట్టె పుల్లలు, బొగ్గుల బస్తాలు వున్నాయి ఆ గదిలో.

కట్టెలు చెదురుగా లేక చక్కగా పేర్చబడివున్నాయి ఎప్పుడైనా ఇక్కడకు వచ్చి వుండదలచుకొంటే కొన్ని నెలలపాటు దేనికీ తడుముకో నక్కరలేని పద్ధతిలో నాయుడు సమస్త సంభారాలు సేకరించి వుంటాడని ఊహించాడు.

ఆ గది చీకటిగా వుంది. ఎలెక్ట్రిక్ లైట్ వేసి, ఒకసారి గది నాలుగు మూలలా పరిశీలించాడు. పుల్లల పేర్పులో ఒక ప్రక్క జోడు కనిపించింది. ఆ జోడు ఆధారం లేకుండా కొంకెకు తగిలించబడినట్లుంది మడమ వున్న భాగం కనిపించడంతో దానిని లాగాడు నరేంద్రలాల్. అది రాలేదు. క్రిందకు వంగిచూశాడు. గుండెలు దడదడ కొట్టుకున్నవి. ఆ జోడులో పాదం వుంది. ఒక కట్టెను బాగా ప్రక్కకు ఒత్తిగించి చూశాడు. పైజామా కనిపించింది.

తోటమాలి ఆ దృశ్యాన్ని చూసి హడలిపోయాడు. ఇద్దరూ కట్టెలను

తొలగించారు. ఒక వ్యక్తి మృతకళేబరం కనిపించింది. ముఖంపై గోనెసంచీ కప్పబడి వుంది.

"ఓహో! గోపాలరావుకు చివరకు ఇదా పట్టిన దుర్గతి?" అనుకున్నాడు డిటెక్టివు.

ఆ గోనెసంచీ కూడా తీసి పారవేశాడు. అతనికి కలిగిన విభ్రాంతికి మితిలేదు. ఆ మరణించినది గోపాలరావు కాదు. గోపాలరావు వయస్సు సుమారు 55, 60 ఏళ్ళవరకు వుంటుందని వేణునాధ్ చెప్పాడు. ఇతడు 35 ఏళ్ళలోపువానిలా కనిపిస్తున్నాడు. మాంచి బలిశాలిగా వున్నాడు. తొడుక్కున్న ట్వీల్లు చొక్కా రక్తసిక్తమై వుంది. గుండెల్లోనుంచి ఒక బాకు దూసుకొనిపోయి వుంది.

మోకరించి కూర్చుని, ఆ బాకు పిడిని బాగా పరిశీలించి చూశాడు. కాని ఆ పిడిని తాను తాకలేదు. పిడిదగ్గర ఏమో అక్షరాలున్నాయి. 'ఎన్ని కో-డి-ని కొలా-నేపుల్స్' అని వుంది. క్రింద మరో భాషలో కొన్ని అక్షరాలున్నాయి.

నరేంద్రలాల్ తిన్నగా హాలులోనికి వచ్చాడు. మద్రాస్‌కు ట్రంక్ కాల్ కావాలన్నాడు, టెలిఫోన్‌లో. త్వరగానే కాల్‌కు బదులు వచ్చింది. తన ఇంటి నెంబరును త్రిప్పాడు. అదృష్టవశాత్తు గిరీశే పలికాడు.

"హల్లో. నేనే అన్నా. నిన్నంతా సెంబుదాస్ వీధిలో దర్యాప్తు చేసి, రాత్రి పదింటికి ఇక్కడకు వచ్చా. అక్కడి కబుర్లేమిటి?" అని అడిగాడు గిరీశ్. 'ఓ. చాలా వున్నాయి. నువ్వు తిన్నగా కీల్పాకుకు వెళ్ళి పోలీస్ ఇన్స్పెక్టర్ మాధవమీనన్‌ను కలుసుకో. నేను చెప్పమన్నానని, వీలైతే కమిషనర్ అనుమతి తీసుకుని వెంటనే నీతో బయలుదేరి రమ్మని ఇక్కడకుతీసుకురా. వచ్చేటప్పుడు ఎగ్మూర్ హైరోడ్‌లో జాన్‌సన్ కంపెనీ ప్రక్కనే వున్న మోహన్ లాడ్జిలో వుంటాడు వేణూనాధ్. అతణ్ణి కూడా కారులో ఎక్కించుకురా. ఇక్కడ హత్య జరిగింది. హత్యచెయ్యబడిన వ్యక్తిని ఐడెంటిఫై చెయ్యడానికి మాధవమీనన్ సహాయపడవచ్చు. ఒక్కక్షణమైనా ఆలస్యం చెయ్యకు."

"హత్యే..." అన్నాడు గిరీశ్.

"అరె మతిలేదా ఏమిటి నీకు. ఇదిగో, తిన్నగా టాక్సీలో బయలుదేరిరా. ఈస్ట్ గేట్ దగ్గర సౌరాష్ట్ర స్కూల్ ప్రక్కనే మాధవీభవన్ హోటల్ దగ్గరకు వచ్చి అడిగితే చెబుతారు. బస్సులు అస్తమానం నడుస్తూ వుంటాయి. ఆ హోటల్‌కు సుమారు మైలున్నర. దూరంలోనే వున్నది గోకుల్ అన్నమేడ బహుశా నీకు నేను హోటల్‌లోనే కనిపిస్తానులే. క్షణాల మీద ఇక్కడ వ్రాలాలి."

నరేంద్రలాల్ స్థానిక పోలీసు స్టేషనుకు ఫోన్ చేశాడు. ఇనస్పెక్టర్ ఇంకా రాలేదని కాన్‌స్టేబుల్ చెప్పాడు.

తాను మదరాసునుంచి గోపాలరావు, నాయుని చూడ్డానికి వచ్చిన ప్రయివేట్ డిటెక్టివునని, గోకుల్‌లో ఉదయం తనకు ఎవరో హత్యచేయబడిన వాని మృత కళేబరం కనిపించిందనీ తాను మాధవభవన్ హోటల్‌లో వుంటానని, అక్కడకు ఇనస్పెక్టరును రమ్మని తాను కోరినట్లు చెబుతూ, ఒకరిద్దరు పోలీసులను అక్కడకు పంపమన్నాడు. ఆ తర్వాత అతడు తిన్నగా హోటల్‌కు బయలుదేరాడు

* * *

"గోకుల్'లో ఎవరో హత్య చేయబడ్డారనే వార్త మధురలో దావానలంలా నలుప్రక్కలా వ్యాపించడానికి అరగంటకూడా పట్టలేదు. ఊళ్ళో పని వున్నవారు, లేనివారు, పెద్దలు, పిన్నలు తండోపతండాలుగా పరిగెత్తుకువచ్చారు. కొంతమంది కాఫీ కూడా త్రాగకుండానే చక్కావచ్చారు. వచ్చిన వారందరికీ ఆశాభంగమే కలిగింది. బంగళాగేటు దగ్గర నలుగురు పోలీసులు. లోపల తోటలో మరికొందరు పోలీసులు వున్నారు. చాలామంది ఆ తరువాత జరగబోయే తంతును సాంతంగా చూడకుండా వెళ్ళరాదనే దృఢ సంకల్పంలో అక్కడ కూర్చుండిపోయారు.

మదరాసునుంచి ఒక డిటెక్టివు వచ్చాడని, మాధవభవన్ హోటల్‌లో వున్నాడని తెలిసి, అతనిని చూడ్డం కోసం జనంలో కొందరు అక్కడకు ఎగబడ్డారు.

గోకుల్‌లో హత్య జరిగిన విషయం నరేంద్రలాల్ వైద్యనాధయ్యర్‌తో చెప్పాడు. ఇన్‌స్పెక్టర్ రాగానే తన గదిలోకి తీసుకురమ్మన్నాడు. మళ్ళీ కాఫీ త్రాగి, పైకి వెళ్ళాడు.

పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోవిందస్వామి మొదలియార్ మోటార్ సైకిల్ పైన హోటల్ దగ్గరకు వచ్చేసరికి 12–15 అయింది.

"డిటెక్టివ్ నరేంద్రలాల్ జీ ఎక్కడ ?" అని అతడు అడిగాడు.

ఇన్సురెన్సు కంపెనీలో మేనేజరను కొన్న ఆ వ్యక్తి డిటెక్టివ్ అని తెలుసుకోగానే వైద్యనాధయ్యర్ రిచ్చపడ్డాడు. మాట్లాడకుండా పైకి తీసుకువెళ్ళి చూపించాడు. క్రిందకువచ్చి కాఫీ తీసుకు వెళ్ళాడు ఇన్‌స్పెక్టర్ కోసం.

గోవిందస్వామి మొదలియార్ డిటెక్టివు నరేంద్రలాల్‌ను కలుసుకొన్నాడు. నరేంద్రలాల్ తాను మద్రాసునుంచి మధురకు వచ్చిన కారణాన్ని - గత రాత్రి గోకుల్‌లో చూసిన దృశ్యాన్ని - ఉదయాన చూసిన మృతకళేబరాన్ని గురించి చెప్పి - జేబురుమాలు భద్రంగా చుట్టి తెచ్చిన రివాల్వరు చూపించాడు.

ఆ తర్వాత తాను మళ్ళీ వస్తానని ఇన్స్పెక్టర్ వెళ్ళిపోయాడు.

సాయంకాలం అయిదు గంటలకు మదరాసునుంచి ఎకాఎకీని కారులో మాధవమీనన్, గిరీశ్, వేణునాథ్‌లు దిగారు. వారు పైకి వచ్చిన పావు గంటకు ఇన్స్పెక్టర్ తిరిగి వచ్చాడు. నరేంద్రలాల్ ఆ ముగ్గురునీ గోవింద స్వామి మొదలియార్‌కు, మొద లియార్‌ను ఆ ముగ్గురికీ పరిచయం చేశాడు.

"నేను ముందు మీ అనుమతి తీసు కుని మరీ ఈ కేసులో అడుగుపెట్టడం మర్యాద. అయితే అసలు సంగతేమిటో తెలుసుకుందామని తిన్నగా ఇక్కడికే వచ్చాను. హత్యచెయ్యబడిన వ్యక్తి మద రాసునుంచి వచ్చినవారైతే, అక్కడి రౌడీసజ్జు అంతా నాకు కొంత ఎరికే క నక రాకవల్ల కొంత ప్రయోజనం వుండగలదని ఆశించాను. మీరు నా చొరవను మన్నిస్తారు కదూ?" అన్నాడు మాధవమీనన్.

"నరేంద్రలాల్‌జీ, మీరు చాలా తెలివి తక్కువగా వ్యవహరించారండి. నిన్న రాత్రే మీరు మాకు ఈ సంగతి రిపోర్ట్‌చేసి వుండవలసింది. సైనికుని ఉడుపులలో ఎవరో పారిపోతూ కని పించాడన్నారు. లోపల గదిలో బల్లలు, కుర్చీలు తిరగబడి, విరిగిపోయి ఒక చిన్న సంగ్రామం జరిగినట్లు తోచిందం టున్నారు. పైగా ఒక శవం బయటపడ్డ దాయె. రాత్రే చెప్పి ఉంటే ఊరు నాలుగు వైపుల దారులు బంద్‌చేసి హంతకుణ్ణి పట్టుకొనకపోయి వుండుమా? మీ నుంచే కేసు చెయ్యిజారిపోయింది." అన్నాడు గోవిందస్వామి మొదలి యార్.

"నా నుంచి కేసు ఎలా పోతైం దంటారు? నిన్నరాత్రి గోకుల్‌లోని గదిలో కుర్చీలు, బల్లలు చిందరవంద రగా పడివున్న వేగాని దెబ్బలాట జరిగి నది నేను చూడలేదు. ఎవరో కొట్టుకొని వుండవచ్చుననేది ఒక సూచనమాత్రమే. ఆ పారిపోతున్నట్లు కనిపించినది దొంగ కావచ్చు. లేదా గోపాలరావే అయి వుండవచ్చు." అనికూడా నరేంద్రలాల్ అన్నాడు.

"రివాల్వరు మాట?"

"లక్షాధికారి. పెద్ద వ్యాపారస్థుడు అయినపుడు గోపాలరావు నాయుడు దగ్గర రివాల్వర్ వుండడం అసంభవం కాదు."

"నాయుణ్ణి ఎవరో బెదిరించి డబ్బు లాగడానికి యత్నిస్తున్నారని మీరు చెప్పారు. ఆ విషయమై మీరు అతని సంజాయిషీకోసమే అక్కడకు వెళ్ళారు. ఇప్పుడే మా మీకు కనిపించిన నిదర్శ నలు అంత ప్రధానమైనట్లు తోచలేదం టున్నారు."

"అది కాదు మహాశయా! నా మాట

లను మీరు అపార్థం చేసుకున్నట్లున్నారు. నాయుణ్ణి ఎవరు బెదిరిస్తున్నది నాకు తెలియదు. అసలు బెదిరిస్తున్నారో లేదో కూడా నాకు తెలియదు. బెదిరిస్తూ వుండవచ్చునన్నది ఆయన భార్య 'ఎలా' అనుమానం. ఆ అనుమానాన్ని ఆమె వేణునాథుతో చెప్పింది. ఈయన నన్ను యీ విషయంలో దర్యాప్తు చెయ్యమని కోరాడు. అదయినా ఎవరికీ తెలియకుండా? తుదకు గోపాలరావు నాయుడికైనా అనుమానం కలగకుండా దర్యాప్తు జరపమన్నాడు."

"నిన్నరాత్రి మీరు ఒకవేళ నాయుణ్ణి కలుసుకొనివుంటే ఈ విషయం ప్రస్తావించేవారా?"

"ఉహుఁ! ముఖ్యంగా ఆయన్ను ఒకసారి కలుసుకొని, పరిచయం చేసుకుందామని, ఎంతవరకు లోకాభిరామాయణంలో ఆయనచే ఈ విషయాన్ని చెప్పించడానికి అవకాశం వుంటుందో పరిశీలిద్దామని నా తలంపు. అది ఒకవేళ నెరవేరవచ్చు, నెరవేరకపోవచ్చు. నిజంగా ఆయనను బెదిరిస్తూవుంటే అది నేను జోక్యం కలిగించుకోవలసిన విషయం కాదు ఆయనే పోలీసులకు రిపోర్టు చెయ్యాలి. ఏమంటావు మీనన్."

"నేను ప్రస్తుతంలో ఏమీ అనదలచుకోలే"దన్నాడు మీనన్.

"ఏమైనా అనండి నిన్నరాత్రే మీరు ఈ భోగట్టాను మాకు తెలిపి వుంచవలసింది. ఇప్పుడు విచారించి లాభం ఏమిటి? పిట్ట ఎగిరిపోయింది" అంటూ ఇన్‌స్పెక్టర్ గోవిందస్వామి మొదలియారు వేణునాథ్ వంకకు తిరిగి "మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడగవలసి వుంది." అన్నాడు.

"దివ్యంగా అడగండి." అన్నాడు వేణునాథ్.

ఇనస్పెక్టర్ ప్రశ్నలకు సమాధానంగా చెప్పినదీ, ఇదివరలో నరేంద్రలామతో అతడు చెప్పినదీ ఇంచుమించుగా ఒకటే.

అయితే ఆ చెప్పిన సమాధానాలలోని ఒక సమాధానాన్ని పురస్కరించుకొని ఇన్‌స్పెక్టర్ ఇలా అన్నాడు.

"అయితే మీ ఉద్దేశం తన జమాదార్ ప్రియుని ప్రోద్బలాన, నాయుడు కుమార్తె లీల తన తండ్రినే బెదిరించి డబ్బు లాగచూస్తున్నదని. అవునా?"

"కొంపముంచారు. అది నా ఉద్దేశం కాదు. ఒకవేళ కూతురే ఈ కుట్రలో చేరివుండవచ్చు నన్న అనుమానాన్ని వెలిబుచ్చినది నాయుడు భార్య. నేను కాదు మహానుభావా."

"ఈ జమాదార్ ప్రపంచంలోని ఏ రంగంలో ఉద్యోగంచేసి వచ్చాడు? అతని పేరేమిటి?" అని, అడిగాడు ఇన్‌స్పెక్టరు గోవిందస్వామి మొదలియార్.

"ఇటీవల అతడు మధ్యప్రాచ్యం



లోన

నుంచి తిరిగివచ్చాడని విన్నాం. పేరు రామారావు. నాయుళ్ళ అబ్బాయి. కాపరం మద్రాస్ మాంబళంలో." అన్నాడు నరేంద్రలాల్.

"ఆ బాకు మీరు చూశారా? అది మనదేశంలో దొరికే బాకులా లేదే."

"అవును. అది ఇటలీలో కొన్న బాకై వుండాలి పిడిక్రింద 'ఎర్రిని కోడి నికోలా, నేపుల్స్' అని వుంది కూడా."

"ప్రహరీ దాటి పారిపోయినవాడు సైనికుడని గాని, సైనికోద్యోగి అని గాని మీరు రూఢిగా చెప్పగలరా?"

"చెప్పలేను. అతడు ధరించినవి సైనికుని ఉడుపులవలె వున్నవనే నా తాత్పర్యం."

"అయితే మిస్టర్ వేణునాథ్! మీరు గోపాలరావుగారిని బాగా ఎరుగుదురా?"

"ఆదేమిటండీ, ఆయన దగ్గర ఆరేళ్ళనుంచి నౌకరీ చేస్తుంటే-"

"అయితే ఒకసారి మీరు 'గోకుల్'కు రావలసి వుంటుంది. అక్కడ ఒకరు హత్యచెయ్యబడి వున్నారు. మీరావ్యక్తిని ఎరుగుదురేమో చెప్పాలి."

"అయితే ఒకవేళ గోపాలరావు గారే-"

"అవునో కాదో మాకు తెలియదు. అయితే గియితేలంతో మాకు పనిలేదు. ఎక్కడైనాసరే, ఎప్పుడైనాసరే అట్టో ముక్కో తేలిపోవలసిందే."

"నేను కూడా రావచ్చునా? అతడు మద్రాసీయే- అయితే, నరేంద్రలాల్ అనుమానిస్తున్నట్లు ఆ చంపబడిన ఆసామీ గోపాలరావు కాక మరెవరైనా అయివుంటే నేను గుర్తించటానికి కూడా కొంత అవకాశం వుంటుం"దన్నాడు మాధవమీనన్.

"సరే, రండి." అన్నాడు పోలీస్ ఇన్‌స్పెక్టర్.

అందరూ పోలీస్ మోటార్ వాన్‌లో గోకుల్‌కు వెళ్ళారు. గేటు దగ్గర ఒక బ్యూకుకారు వుంది. ఒక యువతి లోపలికి వెళ్ళనీయనన్న పోలీసుతో ఏమో వాదిస్తూవుంది.

ఆమెను చూడగానే నరేంద్రలాల్ వేణునాథ్‌ను చూసి "ఇదిగో, ఆ అమ్మాయి 'ఎలా' కాదు గదా!" అన్నాడు.

"అవును. అరె! కొంపతీసిందే. ఇక్కడికి వచ్చిందేమిటి?" అన్నాడు వేణునాథ్.

"సరే, కాని ముందు వెళ్ళి మరేం ప్రమాదంలేదని, హత్యచెయ్యబడినది గోపాలరావుగారు కాదని, ఏమీ ఆందోళన పడవద్దని చెప్పండి. మీరు ఇక్కడికి బయలుదేరినట్లు ఆవిడకు తెలుసా?"

"నేనసలు కనిపించనిదే ఉదయం."

అంటూ అతడు ఆవిద దగ్గరకు వెళ్ళాడు.

25 ఏళ్ళకు మించని ప్రాయంలో వున్న ఎలాను చూచి గిరీశ్ ఆశ్చర్య పడినాడు.

వేణునాథ్ ఆమె దగ్గరకు వెళ్ళి భయపడవలసిన పనేమీ లేదన్నాడు.

"పోలీసులు ఇక్కడికి ఎందుకు రావాలి ? ఏం జరిగింది ? నా ఇంట్లోకి నన్ను వెళ్ళనీయనంటారేమిటి ? ఏదో విపత్తు సంభవించి వుండాలి. లేకపోతే పోలీసులు రావడానికి కారణం ఏమిటి ? మీరు ఇక్కడికి ఎందుకు వచ్చారు" అంటున్నది ఆమె.

ఇంతలో ఇనస్పెక్టర్ గోవింద స్వామి మొదలియారు రాగా, ఆ ప్రశ్నకు సమాధానం చెప్పక వేణునాథ్ "ఈవిడ నాయుడుగారి భార్య, శ్రీమతి ఎలా" అని "వీరు, పోలీస్ ఇనస్పెక్టర్ గోవిందస్వామి మొదలియార్" అని పరిచయ పరిచాడు.

"నమస్కారం" అంది ఎలా.

మొదలియార్ ప్రతి నమస్కృతిచేసి "ఆ కారులోనే యకాయకిని మదరాసు నుంచి వచ్చారా మీరు ?" అన్నాడు, అవునని ఆమె చెప్పగా.

"ఓ పది పదిహేను నిమిషాలపాటు కారులోనే కూర్చోండి, కావలిస్తే ఆవరణలోకే కారును రప్పిస్తాను. ఆ తర్వాత మాట్లాడుదాం. మీరేం దిగులు పడకండి. కాఫీ తెప్పించమంటారా ?" అని అడిగాడు మొదలియారు.

ఆమె వద్దు అంది. డ్రైవరు కారును ఆవరణలోనికి పోనిచ్చాడు. ఆమె వెళ్ళి కారులో కూర్చుంది.

ఇనస్పెక్టరు, మాధవమీనన్, గిరీశ్, వేణునాథ్, నరేంద్రలాల్ తిన్నగా హాలులోకి వెళ్ళారు. ఒక మంచంపైన హత్య చెయ్యబడిన వ్యక్తి మృత కళేబరం వున్నది. దానిపైన తెల్లని దుప్పటి కప్పారు. ఒక మూల దిగులు పడివున్న తోటమాలి వీరప్ప నిలబడి వున్నాడు.

హత్య చెయ్యబడిన వ్యక్తిని పరీక్షించిన డాక్టర్ "ఇదేం న్యాయమండీ, ఇనస్పెక్టర్ గారు, నాకు అవతల అర్జంట్ కేసులున్నాయని మీకు చెప్పాను గదా ! నే నెప్పణ్ణుంచి మీకోసం కాచుకొని వున్నానో తెలుసా ?"

"అవునండీ ! పోలీసు వ్యవహారాలు ఇవి, అనుకున్నట్లు క్షణాలమీద జరుగుతాయా ? ఏమిటి మీ పరీక్షా పర్యవసానం ?"

పర్యవసానాని కేముంది? హత్యజరిగి 10 లేక 12 గంటలైనా అయి వుంటుంది. బాకుతోటే ప్రాణంతీసింది- పైగా ఒంటిమీద కూడా కొన్ని గాయాలున్నాయి. బాకు పెల్లగించవలసి వచ్చింది."




"రబ్బరు తొడుగులు ధరించే తీరారా ?" వ్రేలి ముద్రలు...?"

"ఓహో ఆ మాత్రంకూడా తెలియదనుకున్నారా ? ఎడం మణికట్టు ఎముకకు గట్టి దెబ్బ తగిలింది. బహుశా నిన్నరాత్రి కొట్లాటలో తగిలిన దెబ్బ వల్లనే అది విరిగివుండాలి. ఇక నేను పోవచ్చు గదా."

"నిరభ్యంతరంగా. ఆనక స్టేషన్‌కు వచ్చి రిపోర్టు వ్రాసి ఇవ్వండి. సరే, వేణునాథ్‌గారూ ఇలా వచ్చి, ఈయన ఎవరో మీకు తెలుసునేమో చెప్పండి." అంటూ గోవిందస్వామి మొదలియార్ ఆ వ్యక్తి ముఖంపై కప్పబడివున్న దుప్పటిని తొలగించాడు.

వేణునాధ్ నిర్విణ్ణుడైనాడు. తల పంకించి "ఎవరో నాకు తెలియదు. నే నెప్పుడూ చూసి "వుండలేదు" అన్నాడు.

"అయితే ఇతడు గోపాలరావుగారు కాదన్న మాటేనా ?"

"కాదు, ముమ్మాటికీ కాదు "

సరే, మిస్టర్ మీనన్ ! మీరు వచ్చి చూడండి."

మాధవమీనన్ ఆ వ్యక్తిని పరకాయించి చూశాడు. "ఉహు ! ఇతిణ్ణి నే నెప్పుడూ చూసి వుండలే" దన్నాడు.

"ఏయ్ 162, వెళ్ళి కారులో కూర్చున్న ఆవిడను పిలుచుకురా" అన్నాడు ఇన్‌స్పెక్టరు.

ఆమె వచ్చింది.

"అమ్మా ! భయపడకు. నిన్న రాత్రి ఇక్కడ ఒక వ్యక్తిని ఎవరో చంపివేశారు. మీ ఆయనకేమీ ఆపద

ఘటిల్లలేదు లెండి. ఇత నెవరో తెలి యడంలేదు. మీరు గుర్తించగలరేమో చూడండి" అంటూ ముఖంమీది దుప్ప టిని ఒత్తిగించాడు.

భయపడుతూనే ఆమె ఆ మంచం మీది వ్యక్తిని చూసి 'అయ్యో' అని కెవ్వున కేకవేసి క్రిందపడి మూర్ఛ పోయింది. పడిపోతుంటే గిరీశ్ తటాలున పట్టుకొన్నాడు.

నరేంద్రలాల్ ముందుకు వచ్చి, 'వీరప్పా ! నీళ్ళు' అన్నాడు. వీరప్ప ఒక గ్లాసుతో నీరు తెచ్చి ఇచ్చాడు.

నరేంద్రలాల్ ముఖంపై నీళ్ళుచల్లి సేదదీర్చాడు. ఆమె కొంచెం తేరుకుని, వెక్కి వెక్కి ఏడవ నారంభించింది.

"అమ్మా. ఒక్క నిమిషం మీరు ఊరడిల్లాలి. మీకు అనవసర వ్యథ కలిగించాం. ఇలా చూడండి. ఇత నెవరు ? మీకేం బంధువుకు కాడు గదా ?" అన్నాడు, గోవిందస్వామి మొదలియార్.

ఆమె బదులు చెప్పక ఇంకా ఏడు స్తూనే వున్నందున "మీరు కొంచెం శాంతించాలి. మాకు ఇంకా చాలా పని వుంది. మీ సంజాయిషీ పూర్తి అయితే ఇక్కణ్నుంచి మనం అంద రమూ వెళ్ళిపోవచ్చు" అన్నాడు ఇనస్పెక్టర్.

ఆమె ఏడుపు మానింది. ముఖం మాత్రం వివర్ణమైపోయింది. పెదవులు వణుకుతున్నాయి.

నరేంద్రలాల ఒకసారి గిరీశుని వంక - ఒకసారి మాధవమీనన్‌వంక సాలోచనగా దృష్టిసారించాడు. అతని చూపులోని భావాన్ని గ్రహించినట్లు వారు తల పంకించారు.

"ఇత డెవరు తల్లీ ?" అని ఇన్ స్పెక్టర్ ప్రశ్నించాడు.

"మోహనరావుగారు. ఆయన మాకు దూరపు బంధువు. మదరాసులోనే ఏదో వ్యాపారం చేస్తున్నారు. మా ఇంటికి అప్పుడప్పుడు వస్తూ వుంటారు."

"ఇతడు ఇక్కడికి ఎందుకు రావలసి వచ్చిందో చెప్పగలరా ?"

"నేనే పంపాను. మా ఆయన ఇక్క డకు వచ్చిన తరువాత సంగతి తెలియ లేదు. ఓ వారంరోజులపాటు ఏ బాదర బందీ లేకుండా విశ్రాంతి తీసుకొంటేగాని బ్రతకలేనని ఆయన బయలుదేరారు. మరునాడే నాకు ఫోన్ చేస్తానన్నారు. కాని నిన్నటివరకూ అటువంటిదేమీ జరగలేదు. బయలుదేరిననాడు ఆయనకు స్థిమితంగా లేకపోవడంవల్ల ఒంట్లో ఎలా వుందో అని భయపడ్డాను. నిన్న ఈయన రాగానే ఆయన ఒంట్లో ఎలా వుందో తెలియక ఆందోళనగా వుందని చెప్పాను.

"తాను ఏదో పనిమీద రామనాథ్ వెళుతున్నాననీ, దారిలో మధుర దగ్గర ఆగి, మావారిని చూచి ఫోన్ చేస్తానని చెప్పి వెళ్ళారు."

"మీవారికి ఒంట్లో బాగా లేదన్నారు గదా ? ఏమిటి కంప్లైయింట్ ?"

"అదేమోగాని గుండెల్లో నొప్పి వచ్చిందన్నారు"

"డాక్టరుకు కబురంపలేకపోయారా?"

"డాక్టర్లన్నా - మందులన్నా ఆయనకు తలనొప్పి. కాస్త విశ్రాంతి వుంటే చాలుననే ఇక్కడకు బయలుదేరి వచ్చారు."

"ఆయన ఏ రోజున ఇక్కడకు బయలుదేరి వుంటారో చెప్పగలరా ?"

"బుధవారం అనుకుంటాను."

"పోనీ మీరే ఫోన్ చెయ్యలేక పోయారా ?"

"లక్షసార్లు చేశాను. బదులు లేదే. ఎప్పుడు పిలిచినా జవాబే లేకపోయె. అందుచేతనే ఈయనగారిని బ్రతిమాలా. నిన్న సాయంకాలం ఈయననుంచి కబురు వస్తుందని ఆశించా. అదేమీ లేక పోవడంవల్ల ఇక వుండలేక నేనే బయలు దేరి వచ్చా."

"మీ ఆయనకూడా కారులోనే వచ్చారా ?"

"అవును. మాకు రెండు కార్లున్నాయి. నాకేమో నిన్నరాత్రి నుంచీ గుండెల్లో దిగులుగానే వుంది. ఏదో కీడు తప్పదనే తోచింది. అనుకున్నంతా అయింది. ఆయన ఏమైనారో." అంటూ మళ్ళా ఏడవసాగింది.

"ఆయన ఏమైనారో తెలిస్తే ఇక ఆందోళన పడవలసిన పనే వుండదు కాదుటమ్మా. మేము అడిగేది కూడా ఆ ప్రశ్నే. పోలీసులు అన్నిచోట్లా గాలిస్తున్నారు మరి కాస్సేపు మీరు కారులోనే కూర్చోండి" అని పోలీస్‌తో కాఫీ తెచ్చి పెట్టమన్నాడు. 'అవిడ వద్దు' లెండి అంది.

అవిడ హాలులోనుంచి వెళ్ళిపోగానే ఇనస్పెక్టర్ గోవిందస్వామి మొదలియార్ ఇలా అన్నాడు-

"మిత్రులారా ! జరిగినది ఇది. గోపాలరావు అనే లక్షాధికారి నాలుగు రోజుల విశ్రాంతికోసం ఇక్కడకు వచ్చాడు. ఆయన ఒంట్లో అస్వస్థతగా వుంది. భార్య కూడా రాలేదు. ఆ తర్వాత ఆయన ఏ పరిస్థితిలో వున్నాడో అనే బెంగతో ఒక చుట్టాన్ని ఇక్కడకు పంపింది చుట్టం రామ్‌నాథ్ వెళుతూ ఇక్కడ దిగాడు. ఇక్కడ ఒకటి రెండు గంటలు వుండి అతగాడు వెళ్ళిపోదామనుకొని వుంటాడు. ఆ సాయంకాలం వరకు ఆగాడు. ఆ తర్వాత ఎవరి చేతనో పొడిచి చంపివేయబడ్డాడు. ఒక సైనికుడు ప్రహరీ గోడ పారిపోతూండగా కనిపించాడు. మీరు రాత్రి రిపోర్టు చేసివుంటే సైనికుడు తప్పకుండా దొరికివుండేవాడుకదా."

"దొరికితేమాత్రం ఏం నేరం ఆరోపిస్తారు ? హత్యచేశాడంటే ఎందుకు చేశాడంటారు ?"

"దొంగతనం హంతకుడి ఉద్దేశం. అంతకంటే మరేమి ?" అన్నాడు హెడ్ కాన్‌స్టబుల్

మీనన్ ముందుకు వచ్చాడు. హత్య చెయ్యబడివున్న మోహనరావు జేబులో నుంచి మనీపర్స్ తీశాడు. రెండువందల రూపాయల నోట్లున్నాయి.

"ఏమయ్యా ! దొంగతనమే హంతకుని ఉద్దేశమైతే, దీనికేమి బదులు చెబుతావు ? ఇతడూ, గోపాలరావు మాట్లాడుకుంటూ వుండగా ఈ సైనికుడు ప్రవేశించి "డబ్బిస్తారా, చంపనా" అని బెదిరించి వుండాలి. నువ్వుచేసిన సూచన నిజమైతే. రివాల్వర్ కూడా సైనికునిదే అయివుండాలి. ఆ పోట్లాటలో మోహనరావు చేతికి చిక్కివుండాలి రివాల్వర్. దానితో సైనికుడు బాకుతో పొడిచివేసి వుండాలి. ఇది చూసి విభ్రాంతిపడిన గోపాలరావు వెంటనే ఎక్కడికో చక్కాపోయివుండాలి. మోహన్‌రావు జేబులో పర్స్‌గాని, మేడమీదకు వెళ్ళి గోపాలరావు మంచంక్రిందనో ఎక్కడో కనిపించగల తాళపు చెవులతో ఇనప్పెట్టిలోనూ, బీరువాలోనూ వుంటైడబ్బుగాని కాజేయ కుండానే ఆ దొంగ పారిపోయి వుండాలి. ఇదంతా అసంబద్ధంగా లేదూ ?"

ఇంతలో ఒక పోలీస్ పరుగెత్తుకు వచ్చి "సబిన్‌స్పెక్టర్‌గారు మిమ్మల్ని రమ్మన్నారు బాబూ ! చెరువులో ఒక నావ కనిపించింది. దానిలో ఎవరివో పత్రికలు, పళ్ళు వున్నాయి" అన్నాడు.

"సరే నడు. ఏమండీ ! మీరు కూడా రండి." అని గోవిందస్వామి కొంచెం తొందరగా నడిచాడు.

వీరుకూడా ఇనస్పెక్టరును అనుసరించారు. దారిలో మీనన్ "బాయీ ! గోపాలరావు భార్య బలే అందమైన మనిషే. అందుచేతనే డైపిస్తుగా చేర వచ్చిన చిన్నదాన్ని చూసి నాయుడు..." అన్నాడు.

"అయితే మోహనరావు ఈ అమ్మాయితో ఎక్కువ చనువుగా వుంటూ వుంటాడా ఏమి ?" అని నరేంద్రలాల్ వేణునాధ్‌ను అడిగాడు.

"ఆ దంపతులకు ఎవరో కొద్దిమంది మాత్రమే స్నేహితులు వున్నారు. ఇద్దరికీ చదరంగం వచ్చు. ఇక చదరంగం ఆడేవారైనా వస్తే ఆవిడ తప్పకుండా వారిని ఆడుటకు ఆపుచేసి, ఒకటి రెండు ఎత్తులు వేస్తుంది. ఇక భోజనం కూడా ఆ ఆడేవారికి అక్కడే. ఇష్టముంటే నాయుడు కూడా ఒక ఎత్తు వేస్తాడు. లేదా చూస్తూ కూర్చుంటాడు. వీరిద్దరి మధ్య అంత అంతరంగిక పరిచయంవున్నట్లు తోచదు." అన్నాడు వేణునాధ్.

బంగళా వెనుకభాగంనుంచి ఒక నూరు గజాల దూరంలో ప్రహరీ గోడకు ఒక గేటు వుంది. ఆ గేటు

నానుకునే చెరువు వుంది. చెరువు గట్టు నుంచి క్రిందకు మెట్లున్నాయి. ఆ మెట్లప్రక్కనే ఒక నావ కట్టివేయబడి వుంది.

ఊరికి దూరంగా వుండడం ఆ ప్రాంతంలో ఇళ్ళు అట్టే లేకపోవటం మూలాన ఆ చెరువు ప్రజలకు అంత ఉపయోగంలో లేదు. చెరువుకు నాలుగువైపులా చెట్లున్నవి. ఎప్పుడో ఆ ప్రాంతం నిస్తబ్ధంగా, నిర్జనంగా వుండేటట్లే తోచింది.

సబిన్‌స్పెక్టర్ వీరందరినీ చూసి, నమస్కరించాడు.

"ఈ నావ అటువైపు నీటిలోనే తేలుతూ వుంటే, పోలీసులు చెరువులో దిగి గట్టుకు చేర్చారు" అన్నాడు.

నావలో ఒక ఇలస్ట్రేటెడ్ వీక్లీ, ఒక యాపిల్, చాకు, రెండు బత్తాయిపళ్ళు, ఏడెనిమిది స్పెన్సర్ చుట్టలు, ఒక అగ్గిపెట్టె ఒక చేతికర్ర వున్నవి.

ఆ చేతికర్ర ఆయనదే అన్నాడు వేణునాథ్.

రెండు చుట్టలను పైకితీసి నరేంద్రలాల్ 'ఇవి ఆయన కాల్చేవేనా? సిగరెట్లు కాలుస్తారేమో' అన్నాడు.

"చుట్టలూ, సిగరెట్లూ కూడా త్రాగుతారాయన. స్పెన్సర్ చుట్టలు, క్రీకాసిల్స్ సిగరెట్లు ఆయనకు అలవాటు."

"ఆవిడను కూడా పిలిచి, ఈ చేతికర్రను వీటిని గుర్తించగలదేమో అడగడం మంచిది కాదూ?" అన్నాడు గోవిందస్వామి. అని ఒక పోలీసును పంపాడు.

ఎలా వచ్చింది. ఆ చేతికర్ర ఆయనదే అంది. చుట్టలు కూడా ఆయన కాల్చేరకమే అంది. తన భర్తకు కూడా ఏదో విపత్తు సంభవించిందని, విలపించ నారంభించింది. "ఏడవకు తల్లీ, ఇంకా అసలు సంగతి బోధపడందే! రండి." అని ఇనస్పెక్టర్ ఆవిడను ఓదార్చి "మనం ఇక్కడ వుండవలసిన పని లేదు. హోటల్‌కు వెళదాం రండి. కాస్త టిఫిన్ తీసుకుందురుగాని, ఉదయం నుంచీ మీకు ఆందోళనతోనే సరిపోయింది'' అన్నాడు.

"చెరువంతా వెతికించండి. కాస్సేపట్లో తిరిగివస్తా. హాలులోని శవాన్ని మార్చ్యురీకి పంపిండి.'' కొంచెం కాఫీ, అని గోవిందస్వామి మొదలియార్ రామచారితో చెప్పి ఆమెను తీసుకుని కారులో వెళ్ళిపోయాడు.

ఇద్దరు పోలీసులు మోహనరావు మృత కళేబరాన్ని వాన్‌లో చేర్చి తీసుకువెళ్ళారు. దానితో గేటుదగ్గర జనం కూడా కొంచెం పలచబడ్డారు.

మీనన్, నరేంద్రలాల్, గిరీశ్, వేణునాథ్‌లు హాలులోనికి వచ్చారు. వేణునాథ్ తనకు మనస్సులో ఏమో బాధగా వుందని, ఓసారి తోటలో

పచారువేసి వస్తానని బయటకు వెళ్ళాడు

"గారేజీలో హిల్మాను కారువుంది అదీ నాయుడిదేనా ?" అన్నాడు మీనన్.

"రెండు కార్లున్నవని చెప్పింది కాదూ ఖాయీ ఎలా ? ఐతే, ఈ గోవిందస్వామి మొదలియార్ మన కంత గా సహకరించేటట్లు కనిపించడు."

"ఏ మలా అంటున్నావ్ ?"

"రివాల్వరుపైన, బాకుపైనవున్న వ్రేలిముద్రలు పరిశీలించాలి. దానికి అతడు అవకాశం ఇవ్వడని నా నమ్మకం."

"ఇవ్వకేం ? కావాలంటే మద్రాస్‌లో ఇనస్పెక్టర్ జనరల్ చేతనే మనకు అవ సరమైన సౌకర్యాలు కలిగించేటట్లు చేస్తా. మనం ఒకసారి మేడ అంతా పరిశీలిస్తే బాగుంటుందేమో !"

ముగ్గురూ మేడమీది గదులు, హాలు, లైబ్రరీ గదీ అన్నీ పరిశీలించ నారం భించారు.

ఇంతలో మరొక పోలీసు రొజు కుంటూ వచ్చి 'సార్, సార్', అన్నాడు.

"ఏమిటి సంగతి" అన్నాడు మీనన్.

"శవం కనిపించింది సార్. సర్కిల్ ఇనస్పెక్టర్‌గారు లేరండి."

"ఆయన హోటల్‌కు వెళ్ళారుగా, కాఫీకి. ఎవరినైనా పంపు. గేట్‌లోని పోలీస్ దగ్గర సైకిల్ వున్నట్లుందే", అన్నాడు నరేంద్రలాల్

"సరే. ఈ లోపుగా మనం వెళ్ళి చూద్దాం. గిరీశ్ ! రా" అంటూ డిటెక్టివ్ చెరువుదగ్గరకు వెళ్ళాడు. సబిన్‌స్పెక్టర్ రాఘవాచారి, ఒక కానిస్టబులు చెరువు అవతల గట్టునవున్నారు. పచ్చికమీద మృతకళేబరం వున్నది.

"నరేంద్రలాల్ ఆ మరణించిన వ్యక్తిని పరికించాడు.

"వేణునాధ్ వర్ణననుబట్టి ఇతడు నిస్సందేహంగా గోపాలరావునాయుడే అయివుండాలి అయితే ఈ దెబ్బ ఏమిటి శిరస్సుమీద ?" అన్నాడు నరేంద్రలాల్

"నావలోనుంచి తూలి నీటిలో పడి పోయాడో, ఎవరైనా త్రోసివేశారో ఏమో. అలా పడిపోయినపుడు నావ అంచుకు తల తగిలి గాయమై వుండ వచ్చు. లేదా ఎవరైనా ఏ కర్రతోనో కొట్టి వుండవచ్చును కూడా." అని మీనన్ సూచించాడు.

"అయితే మోహన్‌రావు నిన్న ఎన్ని గంటలకు ఇక్కడకు వచ్చి వుంటాడని ఎలా చెప్పింది ?"

"మధ్యాహ్నం వచ్చి వుండాలని తోస్తుంది ఆమె మాటలనుబట్టి "

"అయితే ఇతడు కారుమీద వచ్చా డంటావా ?"

"అటువంటి సూచన ఏదీ కనిపిం చదు. బహుశా రైలుమీద వచ్చి వుంటాడు."

"నా ఉద్దేశం నావలోనుంచి గోపాల రావు నీటిలో పడిపోయిన సమయంలో- బహుశా మోహనరావుకూడా నావలోనే వున్నాడని", అన్నాడు నరేంద్రలాల్.

"ఇంతకూ ఇతడు గోపాలరావో - కాదో ధ్రువపడలేదే-"

"గోపాలరావు కాక మరెవరై వుంటాడు? అయినా సందేహం ఎందుకు? గిరీశ్! వేణునాథ్‌ని పిలు."

"వేణునాథ్‌కోసం గిరీశ్ పరుగెత్తాడు. మూడు నిమిషాల్లో తిరిగి పరుగు పరుగున వచ్చి "అన్నా! రా, వేణునాథ్ చనిపోయినట్లుగా తోస్తుంది."

నరేంద్రలాల్ పరుగెత్తాడు. మీనన్ కూడా నరేంద్రలాల్‌ను అనుసరించాడు. తోటలోనే ఒక చెట్టుక్రింద వేణునాథ్ నిలువునా కూలివున్నాడు.

* * *

మద్రాస్‌లోని తన మేడమీది గదిలో ఈజీచైరులో కూర్చుని డిటెక్టివ్ నరేంద్రలాల్ సిగరెట్ కాలుస్తూ "గిరీశ్! వేణునాథ్‌కు ఎలా వుంది?" అని అడిగాడు.

"కొంచెం నయమే - ఇంకా కనీసం పదిరోజులైనా ఆసుపత్రిలో వుండాలని డాక్టరు అన్నాడు. బాగా దిగులుపడి పోయి వున్నాడన్నా. చూస్తూండగా ఏనుగులాటి మనిషి పీనుగైపోయాడేం?"

"ఇంకా ఒకరిద్దరికి త్వరలో అదే గతి పట్టుతుంది. మరి మోహనరావును గురించి దర్యాప్తు చేశావా?"

"ఆహా! మరేం విశేషంలేదు. కొంచెం కులాసా పురుషుడు. కారుంది. కొంచెం డబ్బుకూడా వుంది. పెళ్ళి యిందిట, కాని భార్యను ఇతడే వదిలి పెట్టాడో - లేక ఆవిడే ఇతణ్ణి వదిలి పెట్టిందో తెలియదు రాయపేటలో కాపరం - రెండు మూడు క్లబ్బుల్లో మెంబరు. ఫిలిం డిస్ట్రిబ్యూటింగ్ వ్యాపారం నడుపుతున్నాడు. చదరంగం బాగా ఆడతాడు."

"కారు ఇప్పుడు ఇంటిదగ్గరనే వుందా?"

"కారు మరామత్తులో వుందిట అన్నా. జనరల్ పాటర్స్‌రోడ్‌లో ఏదో క కంపెనీ వుందన్నారు. ఒగారేకీలో పైగా రామ నాధ్ ఎంతదూరంలో వుందటావు?"

"ఎన్నాళ్ళనుంచి అక్కడ వుందిట అతని కారు?"

"అయిదారు రోజులనుంచి వుందని విన్నాను. అయితే మధురనుంచి కొత్త భోగట్టా ఏమీ రాలేదన్నా?"

"ఆఁ! డాక్టరు రిపోర్టు వచ్చింది. నీటిలో మునిగిపోవడం మూలాన, వాతం క్రమ్మి మరణించాడని."

"అలా అయితే శిరస్సు ముందరి భాగంలో గాయం ?''

"గాయం ప్రాణాలు తీసేపాటి ప్రమాదకరమయింది కాదంటాడు అతను. నావలోనుంచి తూలి నీళ్ళలో పడిపోవటంలో తగిలిన దెబ్బ అయి వుండవచ్చునని అతని ఉద్దేశం.''

"నీ మాట చెప్పు.''

"నా అభిప్రాయం వేరేవుంది. కమిషనర్‌తో చెప్పి డాక్టర్ జాన్సన్‌చే గోపాలరావు శవ పరీక్షకు ఏర్పాటు చేయమని కోరాను. దానివల్ల ప్రయోజనం వుంటుంది. ఇదిగో భాయీ ! కేసు అంతా మనం ఒకసారి సమీక్షిస్తే, ఇద్దరిలో ఎవరికైనా కొనిఠొన్ని చిక్కులు పరిష్కారమౌతాయి. అసలు మొదట్నుంచీ జరిగిన సంఘటనలు ఒక్కొక్కటిగా యోచించుతాము."

ఇంతలో మాధవమీనన్ రాగా "హల్లో ! సరిగా టైముకే వచ్చావు. కూర్చో." అన్నాడు నరేంద్రలాల్.

"ఏముంది కేసులో ఏర్పడ్డ ప్రతిష్టంభన తొలగడానికి సమాలోచనలు సాగిస్తున్నాం." అన్నాడు గిరీశ్.

"అయితే జమఖర్చులూ రెండూ సరిగా పద్దులేసి చూద్దాం." అన్నాడు మీనన్.

"అలా అయితే ఖర్చు పద్దులు తీయి ముందు. సెలవ పూర్తి అయి, తిరిగి సైనికోద్యోగానికి హాజరు కావలసి వున్న జమాదార్ రామారావు మాయమైనాడు, అలాగే గోపాలరావు కుమార్తె లీలకూడా, ఎక్కడ దాక్కొనివున్నా, బయటకు రావలసిందని పోలీసులు పత్రికల్లో ప్రకటించినా ఆమె రాలేదు. దీనినిబట్టి, ఆమెకూడా నేరంలో ఒక ముద్దాయే అవుతున్నది. ఏదో ఒక విషయాన్ని ఆమె గోప్యంగా వుంచ దలచినట్లే స్ఫురిస్తున్నది కూడా." అన్నాడు గిరీశ్.

"ఆమె కనిపించనంత మాత్రాన మనం అపరాధినిగా నిర్ణయించకూడదు. ఆమెకూడా చనిపోయి వుండవచ్చు, మోహనరావు, గోపాలరావులవలెనే" అన్నాడు నరేంద్రలాల్.

"ఆ రివాల్వరుపై కనిపించిన వ్రేలి ముద్రలు మోహనరావువవి తేలింది." అన్నాడు మీనన్.

"బాకుమీదవో?" అని అందించాడు గిరీశ్.

''బాకు రామారావుది. నేను వాళ్ళ ఇంటికి వెళ్ళాను. అతని తండ్రి చెప్పాడు. కొడుకు తనతోకూడా ఒక బాకు తెచ్చాడని, అలాంటివి తరచుగా దొరకవని' అమెరికన్ సైనికులు ఎంతో డబ్బుపెట్టి కొంటారని, ఎవరికైనా అంటగట్టి కొంతలాభం తీద్దామని కొన్నాననీ చెప్పాడట రామారావు. దానిపై వ్రేలిముద్రలంత స్పష్టంగా లేవు. ఆ తర్వాత మరొక విశేషం. గోపాల

రావు వీలునామా వ్రాశాడు అందులో కూతురుకు ఒక్క కానీకూడా చెంద రాదని వుంది.''

"అయితే మీనన్, ఈ వీలునామా సంగతి ఎప్పుడు తెలుసుకున్నావు?" అని అడిగాడు డిటెక్టివు.

. "నిన్న సాయింకాలం. గోపాలరావు లాయరును కలుసుకోవడం మంచిదని తట్టింది. వెళ్ళాను, ముందు ఒక మరణ శాసనం వ్రాసి ఆయన దగ్గర అట్టే పెట్టాడట. దానిలో తన ఆస్తితో చాలా భాగం, మిల్లులు, మేడలు ఆ పిల్లకే చెందాలని వ్రాశాడట. ఆ తర్వాత కూతురు ఎవరో సామాన్యుణ్ణి పెళ్ళి చేసుకుంటున్నదని తెలిసినమీదట శాబోలు మళ్ళీ మరొక వీలునామా ముసాయిదాపంపి, స్టాంపు కాగితంపై టైపు చేయించి సంతకానికి పంపమన్నా డట. ఆ తర్వాత సంతకం చేశాననీ, గుమాస్తాను పంపితే ఇస్తాననీ ఫోన్‌లో చెప్పారట"

"ఇది ఎప్పుడో జరిగింది?"

"మధుర వెళ్ళడానికి ముందు అనుకొంటాను."

''ఈ రెండవ మరణశాసనంలో గోపాలరావు చేవ్రాలు పెట్టాడా? సాక్షులుకూడా సంతకాలు చేశారా?"

''ఆహా! అంతా సక్రమంగానే వుంది, ఇద్దరు గుమాస్తాలు సాక్షి సంతకాలు చేశారు."

"కాని ఇది విరుద్ధంగా వుంది. లీల ఎవరో సైనికోద్యోగుని వివాహం చేసు కుంటున్నదని విని తండ్రి కోపంతో మండిపడి, ఒక్క కానీయైనా ఇవ్వనన్న మాట నిజం. అది వేణునాథ్ చెప్పాడు. ఆ తర్వాత గోపాలరావు తిరిగి ఏమను కొన్నాడో మనస్సు మార్చుకొని, పిల్ల సుఖమే తనదనీ, అతన్ని విదేశాలకు పంపి ఇంకా చదువు చెప్పిస్తాననీ అన్నా డట మొదట మరణశాసనం ఈ మాట లకు అనుగుణ్యంగా వున్నది. అలాం టప్పుడు లీలా రామారావులకు నాయుణ్ణి బెదిరించి డబ్బు గుంజుకోవలసిన అవ సరం ఏముంటుంది?" అన్నాడు నరేంద్రలాల్.

"సరే, అలా అయితే భర్తను ఎవరో బెదిరిస్తున్నారనీ, అస్వస్థత కారణంగా విశ్రాంతికోసం మధుర వెళ్ళాడనికదూ, ఎలా చెప్పింది. మరి మోహన్‌రావును ఎవరు చంపినట్లు? ఎందుకు చంపినట్లు? గోపాలరావు మృతకళేబరం తోట వెన కాలవున్న చెరువులో ఎట్లా తేలింది?" అని ప్రశ్నించాడు మీనన్.

"నాకు ఒకటి తట్టుతున్నది, ఆ రాత్రి ఫోన్లో పిలిచినదిన్ రామారావే అనుకుందాం. అయితే డబ్బు ఇస్తాను మధురకు రమ్మని నాయుడు చెప్పి వుంటాడు. ఏరోజునైతే కలుసుకొందా మనుకొన్నారో, అనాడు చెరువులో నావపై షికారుకు బయలుదేరి పడిపోయి

వుంటాడు. సాయంకాలం రామారావు వచ్చివుంటాడు. అదే సమయంలో మోహనరావు కూడా లోపలికి వెళ్ళి వుంటాడు. ఇద్దరూ పోరాడుకోవడంలో మోహనరావు రివాల్వరు తీసివుండే - రామారావు బాకుతో పొడిచి చంపి వుంటాడు," అన్నాడు గిరీశ్.

"నాయుడు బయటకు వెళ్ళిన సమయంలోనే మోహనరావు వచ్చివుంటే లోపల ఎట్లా ప్రవేశించి వుంటాడు?" అని మీనన్ తన సందేహాన్ని వెలిబుచ్చాడు.

"కిటికీద్వారా" అన్నాడు గిరీశ్.

"తోటమాలి మాట?" అని మీనన్ అడిగాడు.

నరేంద్రలాల్ ఇలా అన్నాడు:

"తోటమాలి అత్తవారింటికి వెళ్ళి ఆరాత్రికే వచ్చాడు. వాడు నాయుణ్ణి గాని, రామారావునుగాని చూసి వుండడానికి అవకాశంలేదు"

"హోటల్ కుర్రవాడు భోజనం తెచ్చినప్పుడు 'హాలులో పెట్టిపో' అని మేడపైనుంచి కేకవేసిన దెవరైవుంటారు?" అని గిరీశ్ అడగ్గా, నరేంద్రలాల్ అన్నాడు.

"ఇది చిక్కైన సమస్యే. ఒకవేళ షికారు వెళ్ళిన నాయుడు అప్పటికి తిరిగి వచ్చివుండవచ్చు. లేదా మోహనరావైనా చెప్పి వుండవచ్చు. ఇది ఆరు గంటలకు జరిగితే రామారావు లోపల ప్రవేశించి, ఘర్షణ జరిగి, హత్యాకాండతో సమాప్తం కావడం ఏడు - ఏడున్నర గంటలతర్వాతైవుండాలి."

"తన భర్త రాలేదన్న బెంగతోనే మోహనరావును మధుర దగ్గర దిగి ఫోన్‌లో చెప్పమని బ్రతిమాలినానేగాని తన భర్తను బెదిరించి ఎవరో డబ్బు లాగజూస్తున్నారనే మాట ఎలా ఇన్‌స్పెక్టర్ గోవిందస్వామితో చెప్పలేదేం?" అని మీనన్ అన్నాడు.

"ఇనస్పెక్టర్‌తో చెప్పకపోయినా మోహనరావు బంధువుడనే అంటున్నది కనక చెప్పివుండవచ్చు," నన్నాడు గిరీశ్.

నరేంద్రలాల్ ఒక్క క్షణం యోచించి ఈ విధంగా అన్నాడు.

"అయితే నాకు ఇంకా కొన్ని అనుమానాలు కలుగుతున్నాయి. నాయుడ్ని ఎవరో టెలిఫోన్‌లో పిలిచారు. ఆ సమయానికి హాజరుగా వున్న వంటవాడు రిసీవర్ అందుకుని పలికాడు. నాయుడ్ని పిలిచాడు. ఆయన ఫోన్‌లో మాట్లాడాడు. ఏదో ఘోరమైన వర్తమానం విని, తెల్లబోయాడు. మరునాడు మధుర వెళ్ళిపోయాడు. తన స్వస్థతను గురించి ఎలాతో ఫోన్ చేసాననే చెప్పి వెళ్ళాడు. ఫోన్ పిలుపు రాలేదు. ఆందోళన హెచ్చింది. తను అనేకసార్లు ఫోన్‌లో మాట్లాడడానికి యత్నించి విఫలురాలి

నైనా నంది. ఆమె నిజంగా ఎప్పుడో ఫోన్ చేసింది? ఎన్నిసార్లు చేసింది. పగలు బయటకు ఎక్కడికైనా వెళ్ళి వుంటాననుకుంటే రాత్రి ఎందుకు చేసిందికాదు?

'పోనీ బదులు రాలేదండీ. తన దగ్గర మరోకారు వున్నదిగదా, తానే ఎందుకో బయలుదేరి వచ్చిందికాదు? మోహనరావు దూరపు చుట్టం. అతని సహాయాన్ని కోరింది. అతని కారు మరామత్తులో వున్నపుడు తన కారులో వెళ్ళమని ఎందుకు చెప్పలేదు?"

"వెళ్ళిన వెంటనే భర్త క్షేమాన్ని గురించి ఫోన్ చెయ్యమని కోరింది. ఫోన్‌లో అతడు ఏమీ చెప్పలేదు ఇక బయలుదేరుతుందనగా మరొకసారి ఫోన్ చేస్తే మోహనరావైనా బదులు పలికే వాడుగా!"

"మోహనరావే నాయుడ్ని బెదిరిస్తున్నవాడై వుండకూడదూ?" అని అందించాడు గిరీశ్.

మీనన్ అసంభవ' మన్నాడు.

"గోపాలరావును చంపినది ఇంతకీ మోహనరావంటారా, రామారావు అంటారా?" అని ప్రశ్నించాడు గిరీశ్.

"గోపాలరావును ఆ ఇద్దరిలో ఎవరు గాని హత్యచేసినట్లు సాక్ష్యం లేదు. హత్య చెయ్యబడినది మోహనరావు. మోహనరావును చంపినది గోపాలరావా? రామారావా అన్నది ప్రశ్న, నా ఉద్దేశం రామారావే చంపి వుండాలని. మోహనరావు వ్రేలిముద్రలు రివాల్వరుపైన వున్నందున ముందు అతడే దానిని పైకి తీసి వుంటాడు. ఆ బాకును రామారావు గిరవాటు వేసివుండాలి. ఆత్మరక్షణకై అతడు చేసినపని కాని హత్య కాదది. ఆ బాకు తరహా వేరు. లోపల గుల్ల బారివుంటుంది. మాంచి బరువైనది. రామారావులాటి బలవంతుడే దాన్ని అంత ఉధృతంతో గురిచూసి విసిరి వుండాలి. అతడు బాకుతో మీదపడే లోపుగా మోహనరావు సులభంగా రివాల్వరు ప్రేల్చగలిగేవాడు." అన్నాడు నరేంద్రలాల్

''మోహనరావును చంపవలసినంత అవసరం రామారావుకు ఏం వచ్చింది?" అని మీనన్ అర్ధప్రశ్న వెయ్యగా 'అదే అగమ్యంగా వుంది కాని ఒకటిమట్టుకు రూఢిగా చెప్పగలను. మోహనరావు మరణంతో గోపాలరావుకు ఏమీ సంబంధంలేదు నా నమ్మకం, అతడు వారిద్దరి కొట్లాట చూచివుండడనే." అన్నాడు నరేంద్రలాల్

గిరీశుడు, ''అంటే—'' అన్నాడు.

నరేంద్రలాల్ ఇలా అన్నాడు:

'వీరిద్దరు తగాయిదా పడడానికి ముందే ఆయనగారు పరమపదించి వుంటాడని. మీనన్! నేనొకటి చెబుతాను. చెరువులో నుంచి బయటకుతీసిన తర్వాత నాయుడు మృతకళేబరాన్ని చూస్తే అతడు కనీసం

ఒకటి రెండు రోజులక్రితమే మరణించి వుండాలని తట్టింది. డాక్టర్ కనీసం 15 లేక 20 గంటలకు పూర్వం చనిపోయి వుంటాడని తన రిపోర్టులో వ్రాశాడు."

"అయితే గోపాలరావునుకూడా ఎవరో హత్యచేశారంటావా?" అన్నాడు గిరీశుడు.

"అవును, హత్యచేసిన తర్వాతనే అతని శవాన్ని చెరువులో పడవేసి వుండాలి. ఏమైనా డాక్టర్ జాన్సన్ రిపోర్టు వచ్చేవరకు ఏమీ నిర్ణయించ లేము. సరే, మనం మళ్ళీ రంగంలోనికి దిగాలి. నీ ప్రయాణం ఎటు మీనన్." అని నరేంద్రలాల్ అడిగాడు.

"ఆఫీసుకు." అంటూ అతడు లేచి, సిగరెట్ వెలిగించాడు.

"లీలగాని, రామారావు కాని ఎక్కడైనా కనిపిస్తారేమో కొంచెం శ్రద్ధతో చూడు. ఇదిగో గిరీశ్. నువ్వు ఎక్కడికీ వెళ్ళకు. నేను ఇప్పుడే తిరిగివస్తా" నంటూ నరేంద్రలాల్, మీనన్ బయటకు వచ్చారు.

మీనన్ మోటార్ సైకిల్‌పైన వెళ్ళిపోగా నరేంద్రలాల్ తన కారుమీద తక్కాపోయాడు.

తిరిగి అతడు ఇంటికి వచ్చేసరికి ఒంటిగంటయింది. రాగానే "గిరీశ్! భోజనం చేశావా?" అన్నాడు.

"అహా! చేసినట్లే—ఎ

"చేసినట్లే అంటున్నావు. అర్థాకలి భోజనమా?"

"కాదయ్యా! కథేమిటో చెప్పు."

"జయరామ్‌కు మరో చిన్నపని తగిలించి వచ్చాను. నీకుకూడా ఒకపని వుంది. వేణునాథ్ ఎక్కడ వున్నాడన్నావు?"

"సైదాపేటలో - శంకర్స్ నర్సింగ్ హోంలో"

"అయితే నువ్వు ఆ ప్రాంతంలోనే తచ్చాడుతూ అతణ్ణి ఒక కంట కనిపెట్టు. ఏ హోటల్లోనో బసచెయ్యి రేపు ఉదయం తొమ్మిదిలోగా ఫోన్‌చేస్తే అ తరువాత కార్యక్రమం తెలుపుతాను."

"ఆల్ రైట్" అంటూ గిరీశ్ బయలు దేరాడు.

* * *

తలవని తలంపుగా ఉదయం సరిగా ఎనిమిది గంటలకు డాక్టర్ జాన్సన్ నరేంద్రలాల్ ఇంటికి వచ్చాడు. ఉభయులు కాఫీ త్రాగినతరవాత "మీరాక నాకుచాలా ఆశ్చర్యం కలిగించిన" దన్నాడు డిటెక్టివ్.

"డాక్టరుకు - డిటెక్టివులకు సాన్నిహిత్యం ఎప్పుడూ వుండనే వుంది. నా రాకలో విచిత్రం ఏముంది. కమిషనర్‌తో మీరు చెప్పారటగా గోపాలరావునాయుడి శవాన్ని పరీక్షించడానికి నన్ను పంపమని ఆ కబురుపైన నేను మధుర వెళ్ళాను; మార్చుయరీ (శవ పరీక్షా



స్థానం) లో ఆయన మృతదేహాన్ని పరీక్షించి వచ్చాను.''

"అంతకుముందు మధుర డాక్టర్ పరీక్షించి పంపిన నివేదికను చూశారా?"

"ఆహా! మధుర పోలీస్‌స్టేషన్‌లో ఆ రిపోర్టుకూడా చూశాను. ఆ డాక్టరు రిపోర్టుకు నా రిపోర్టుకు అనంతమైన వ్యత్యాసం ఉన్నది. గోపాలరావు నాయుడు చెర్లోపడి నీటిలో మునిగిపోవడం మూలంగా, మరణించలేదు. విషప్రయోగం మూలంగా చనిపోయాడు."

"ఆఁ! విషప్రయోగమా" అని ఆశ్చర్యంగా అన్నాడు నరేంద్రలాల్.

"అవును. నిశ్చయంగా విషం ప్రయోగించబడింది."

"అయితే శిరస్సుపైన గాయం!"

"ఆ గాయంకూడా బలమైనదే. అయితే గాయం మాత్రం ప్రాణాలను తీయగలిగినంత మోపైనది కాదు.''

"ఎప్పుడు చనిపోయాడంటారు?"

"చెరువులో మీకు కనిపించిన నాటికి కనీసం ఒక రోజు ముందే చనిపోయి వుండాలి."

"రైట్. నేనుకూడా అలాగే ఊహిం చాను గాని నామాట మీనన్ నమ్మలేదు. మరొకమాట. అతని శవం చెరువులోకి ఎలా వచ్చిందంటారు?"

"అది తెలుసుకోవటం నాపని కాదు. మీ పని."

"కావచ్చు కాని మీ అభిప్రాయం తెలుసుకోవాలనే కుతూహలంతోనే అడుగుతున్నాను."

"చెరువులో అతడు కాలుజారి నావపై నుంచి పడిపోయి వుంటాడన్నది అసం బద్ధం. చనిపోయిన తర్వాతనే ఎవరో నావలోకి చేర్చి వుండాలి."

"నాకుకూడా అలాగే తోచింది."

"అవును. అయినా ఒక సంగతి ఆయన ఆరోగ్యం సరిగా లేదు. ఒకవేళ బ్రతికినా ఇక రెండు మూడేళ్ళకంటె ఎక్కువ కాలం..."

"మీకు శ్రమఇవ్వకూడదనుకున్నాను గాని, ఇవ్వడంవల్ల ఎంతో మేలు కలి గింది."

"శ్రమకేం గాని ... ఇంక వెళ్ళ రానా?" అంటూ డాక్టర్ జాన్సన్ లేచాడు.

అతడు వెళ్ళిపోయిన తర్వాత నరేంద్రలాల్ నాలుగైదు చోట్లకు వెళ్ళి వచ్చాడు. వచ్చేటప్పటికి ఏడు గంట లయింది. మధ్యాహ్నం భోజనం చెయ్య లేదేమో, స్నానందేసి భోజనం చేశాడు. ఆ తర్వాత హాలులోకి వచ్చాడు. సోఫా పైన కూర్చుని వచ్చిన ఉత్తరాలను చూసుకున్నాడు. మధుర పోలీస్‌స్టేషన్ నుంచి ఇనస్పెక్టర్ మాధవమీనన్ తెప్పిం చిన బాకును, రివాల్వరును కాస్సేపు పరీక్షించాడు.

రివాల్వరును డ్రాయర్‌లో పడవేసి, బాకును టేబల్‌పైనే వుంచాడు. లైట్ ఆర్పివేశాడు. లీల, రామారావులు ఎక్కడ వున్నారో. ఎలా వారి ఉనికిని కనిపెట్టడమా అని యోచిస్తూ వుండగానే నిద్ర పట్టింది. అలా ఎంతసేపు నిద్ర పోయినాడో గాని, ఎవరో హాలులో మసలుతున్నట్టు అలుకుడయింది. తటా లున మెలకువ వచ్చింది. లేచి వెంటనే స్విచ్ వేశాడు.

హాలులోవున్న వ్యక్తి తొట్రుపడ్డాడు. అతని ముఖంలో భయం ప్రస్ఫుట మౌతూ వుంది. సైనికుని ఉడుపులు, నెత్తిపైన మాత్రం 'సివిలియన్' ఉద్యో గుల టోపీ వుంది. గడ్డం మాసిపోయి, కాళ్ళు లోతుకుపోయి వున్నవి "ఎవరు నువ్వు. ఎలా ప్రవేశించావు ఇంట్లో" అని అడిగాడు నరేంద్రలాల్.

"వీధి గుమ్మంలో నౌకరు ఉన్నాడు. మిమ్మల్ని చూడాలని చెప్పాను. పేరు వ్రాసి ఇమ్మన్నాడు. కాగితం లేదనీ -

నన్ను మీరు బాగా ఎరుగుదురనీ చెప్పాను. ఒకసారి లోపలకు తొంగి చూసి మీరు నిద్రపోతున్నారన్నాడు. నేనే లేపుతానని వచ్చాను. క్షమించాలి. నేను దొంగనుమాత్రం కాను."

"నే నెవరో నీకు తెలుసునా ? నిన్ను నేను ఎక్కడా చూసి వుండలేదే."

"ఉండకపోవచ్చు. మీ పేరు ప్రఖ్యాతులు మాత్రం నేను విన్నాను."

"నీ పేరు రామారావు. జమాదార్ ఉద్యోగంలో వున్నావు. తిరిగి డ్యూటీలో చేరకుండా మదరాసులోనే వుండిపోయావు. అది నేరమని తెలియదా? పైగా బ్లాక్‌మార్క్ కూడానే."

"నా పేరు రామారావని మీకు ఎలా తెలుసు ?'' అని ఆ వ్యక్తి ఆశ్చర్యంతో ప్రశ్నించాడు.

''తెలుసు. నువ్వు మధురలో గోపాలరావునాయుడు బంగళాలో మోహనరావనే అతణ్ణి హత్యచేశావు !''

"అబద్ధం."

''మరి ఈ బాకు ఎవరిదీ ?''

"నాదే.''

"నువ్వు చేసిన పని గాకపోతే గుండెలోనికి ఎలా చొచ్చుకుపోయింది ?"

''నాకు అతణ్ణి చంపాలనే ఉద్దేశం లేదు. నా ప్రాణంకోసమే అతనితో చాలాసేపు పెనగులాడవలసి వచ్చింది. అతడు అకస్మాత్తుగా రివాల్వరు తీశాడు. గత్యంతరం లేక నేను బాకును ఉపయోగించవలసి వచ్చింది.''

''ఇప్పుడు ఇక్కడకు ఎందుకు వచ్చినట్లు ?''

"ఈ విషయమంతా మీతో చెప్పివేయడానికే. మీరే ఈ కేసులో పని చేస్తున్నారని తెలిసింది."

"అతణ్ణి పొడిచిన తర్వాత ఏమి చేశావు ?''

"దాని నెలాగైనా బయటకు తీయడానికి యత్నించాను. కాని సాధ్యపడలేదు. అందుచేత వంటగది ప్రక్కనే వున్న మరొక గదిలోకి అతని శవాన్ని చేర్చి, అది ఎవరికీ కనబడకుండా వుండాలని ఆ శరీరంపై కట్టెలు పేర్చాను."

"తర్వాత-"

"ఎవరో వీధితలుపు తట్టారు. ఎవరో చూద్దామని ప్రక్కనే వున్న ఒక గది కిటికీ దగ్గరకు వచ్చి ఆ తట్టేది ఎవరైవుంటారా అని యోచించాను. గదికివున్న గాజు అద్దాల కిటికీనుంచి తొంగిచూశాను. సరిగా అదేసమయంలో ఎవరో బయటనుంచి లోపలకు తొంగి చూస్తున్నారు. ఆ వేషాన్నిబట్టి ఎవరో పోలీసు ఉద్యోగిగాని అయివుండవచ్చు ననుకున్నాను. వెంటనే దీపం ఆర్పివేసి, పారిపోయాను ?"

"ఏ తలుపు తెరచుకొని పారిపోయావు ?"

"దొడ్డివైపు తలుపు తెరవడానికి సాధ్యపడలేదు. ప్రక్కనే ఊచలు లేని కిటికీ వుంది. దాని తలుపులకు లోపల గొళ్ళెం వుంది. ఆ కిటికీద్వారానే నేను ముందు లోపలకు ప్రవేశించాను. బలం కొలదీ త్రోసేసరికి ఒక గొళ్ళెం ఊడిపోవడంతో లోపల ప్రవేశించగలిగాను. ఆ కిటికీనుంచే పారిపోయాను. ఆ ఉద్యోగి కొంతదూరం నన్ను వెంబడించాడు కూడా?"

"అప్పటికి ఎన్ని గంటలై వుంటుంది?"

"రాత్రి ఏడున్నర - ఎనిమిదై వుంటుంది."

"ఆ రాత్రి ఎందుకు వెళ్ళావు అక్కడికి?"

"ఉదయానికే వెళ్ళానండి. వెళ్ళి మధ్యాహ్నంనుంచీ ఆ పరిసరంలోనే తచ్చాడాను."

"ఎందుకు నువ్వక్కడికి వెళ్ళావు?"

"నాయుడుగారిని కలుసుకొనడానికే. ముందు ఎగ్మూర్‌లోవున్న నాయుడు ఇంటికి వెళ్ళాను. అక్కడ నౌకరు చెప్పాడు, ఆయన మధుర వెళ్ళాడని. అప్పుడు మధుర వెళ్ళాను."

"ఉదయమే వెళ్ళానన్నావు కదా - మధ్యాహ్నంవరకు ఏంజేస్తున్నావు?"

'రైలునుంచి దిగిందే ఎనిమిది గంటలకాయె. హోటల్‌కు పోయి, స్నానంచేసి, భోజనంచేసి అక్కడికి వెళ్ళేసరికే ఇంచుమించుగా ఒంటిగంట అయింది. ఒంటిగంటకు నేను తోట లోపలకు వెళ్ళి తలుపు తట్టాను. ఎవరూ పలకలేదు. వెనక్కు చక్కావచ్చి, సాయంకాలంవరకూ అక్కడా, అక్కడా తిరిగాను. చీకటిపడగానే తిరిగి వెళ్ళాను."

"గోపాలరావు నాయుడు నిన్ను రమ్మని కబురంపాడా? లేక నీ అంతట నువ్వే వెళ్ళావా?"

"నేనే వెళ్ళాను. లీలను గురించి కనుక్కుందామని?"

"లీలా?"

"అవును. ఆయన కుమార్తె. మేము ఇద్దరమూ పెళ్ళిచేసుకుందాం అని ఏర్పాటులన్నీ చేసుకున్నాం కాదండీ. మీరు పత్రికల్లో చదివి వుండవచ్చునే."

"అవును, చదివాను. అయితే రామారావ్! లీల ఏమయిందో నీకు నిజంగా తెలియదూ?"

"తెలిస్తే గోపాలరావుగారిని కలుసుకొనడానికి మధుర ఎందుకు వెళతానండీ! రిజిష్ట్రార్ ఆఫీస్ దగ్గరకు వస్తానని రాక, ఆశాభంగం కలిగించినప్పటినుంచి ఆమె జాడే తెలియదు."

తండ్రి నడిగి తెలుసుకుందామనా అక్కడికి వెళ్ళావు?"

"అవును. ఒకవిధంగా ఆయనకు ఈ పెళ్ళి ఇష్టంలేదనీ, కనుకనే ఆయన పూనుకొని ఆపుచేయించడానికి యత్నిం-

చాడనీ విన్నాను. మేం ఇద్దరమూ ఎంత గాఢంగా ప్రేమించుకొన్నదీ ఆయనకు నచ్చచెబుదామనే నా ఉద్దేశం."

"సరే. నువ్వు నాయుడు బంగళాను సమీపించేసరికి సుమారుగా టైం ఎంతయి వుంటుంది?"

"ఏడున్నర-ఏడుముప్పావు."

"అప్పుడు నాయుడు ఇంటిలో వున్నాడా?"

"ఉన్నాడనే నేను అనుకొన్నాను. దీపం వెలుతురు వీధిలోకి కనిపించింది. తలుపు తట్టాను. రెండుసార్లు పిలిచాను. బదులు రాలేదు. ఏమైనాసరే - చివరకు ఎలాగైనా లోపలప్రవేశించి ఆయనతో పరిస్థితి వివరంగా చెప్పివేయాలనే నిశ్చయించుకొన్నాను. మేడ వెనక భాగానికి వెళ్ళి కిటికీల తలుపులు ఒక్కొక్కటే త్రోసిచూశాను. అన్నీ బంద్ అయి వున్నాయి. ఒక కొయ్య కిటికీ కనిపించింది."

కిటికీలో కొయ్యతలుపులు గట్టిగా త్రోసిచూశాను. ఆ ఊపుకు ఒక కొక్కెం ఊడిపోయింది. రెండవ తలుపు కూడా తెరిచి లోపలకు దూకాను. మెల్లగా హాలులోకి వెళ్ళేసరికి, మోహనరావని మీరన్నారే అతడే కనిపించాడు. మేడమెట్ల ప్రక్కనే పొంచుకొనివున్నాడు. అతని చేతిలో రివాల్వరు వుంది.

'ఎవరు నువ్వు?' అని గదమాయించాడు ముఖాన కత్తివేస్తే నెత్తురు రానంతగా అతడు భయపడివున్నట్లు కనిపించాడు. ఆ రివాల్వరును ప్రక్కకు పెట్టివేయవలసినదని, నేను దొంగను కానని చెప్పాను. లీల స్నేహితుణ్ణని, గోపాలరావుగారితో మాట్లాడటానికి వచ్చానని అన్నాను.

'ఆయన లేడని, బయటకు భోజనం చేసి రావడానికి వెళ్ళాడని' అన్నాడు. హాలులోనే టిఫిన్ కారియరు వుంది. ఒక అరటి ఆకుకూడా కారియర్ ప్రక్కన వున్నది.

'అయితే కారియర్ మీల్సు ఎవరికి?' అని అడిగాను.

'నాకోసం వచ్చిందది. ఆయన ఇంటికి తిరిగి వచ్చేసరికి చాలా ఆలస్యమౌతుం'దన్నాడు అతడు. అయినా సరే వుంటాననీ, మధ్యాహ్నంనుంచి ఆయనకోసం అక్కడక్కడ తచ్చాడుతున్నాననీ చెప్పాను. అలా అనగానే అతని ముఖం మరింత వివర్ణమయింది. తాను చేస్తున్న తప్పుపనిని దేనినో కని పెడుతూ వున్నట్లు అనుమానించాడని స్ఫురించింది.

'ఒకటి రెండు నిమిషాలు అలాగే నిలబడ్డాడు. ఏమనుకొన్నాడో వుండండి అని హాలులోనే టేబిల్ ప్రక్కనున్న ఫోన్ తీసి, ఎవరితోనో మాట్లాడాడు. 'ఏమయ్యోయ్! ఇలారా. ఆయన

నిన్ను పిలుస్తున్నారు. వెళ్ళి మాట్లాడండి' అన్నాడు.

నేను ఫోన్ దగ్గరికి వెళ్ళి-హల్లో అన్నాను. అవతల ఆయన ఏమీ బదులు చెప్పకుండానే, మోహన్‌రావు దేనితోనో నా నెత్తిపై కొట్టాడు. అది ఏమో చూడడానికికూడా అవకాశం లేక పోయింది. దెబ్బ కొంచెం గట్టిగానే తగి లిందిగాని నేను ఆ సమయానికే కదల డంలో భుజానికి దూసుకుపోయింది.

"నేను రెండు మూడడుగులు ప్రక్కకు వేసేసరికి నాపై కలియ బడ్డాడు. అతడుకూడా మాంచి బలం గలవాడేమో - ఇద్దరము సింహాల్లా దెబ్బ లాడాం. ఆ త్రోపుల్లాటలో నేనూ అతనూ హాలులోనుంచి కొంచెం వెనకాలవున్న లైబ్రరీ గదివరకు వెళ్ళాం. లైబ్రరీగది తలుపుదగ్గర కొట్టుమిట్టాడడంలో ఇద్దరం లోపలపడ్డాం. ఆ తర్వాత అతనూ నేనూ సమానఉజ్జీ కావడంవల్ల తబ్బిబ్బై ఇక చేతికందినదల్లా విసరడం మొదలుపెట్టాడు. ఇద్దరిమధ్య పుస్తకాలు, కుర్చీలు, బల్లలు, గడియారం - అన్నీ ఆయుధాలుగా దొర్లాయి. ముక్క లైనాయి. నాశనమైనాయి. అకస్మా త్తుగా జేబులోనుంచి అతడు రివాల్వరు తీశాడు. ఇక ప్రేల్చి చంపకమానడని నా దగ్గరవున్న ఆ బాకును ప్రయోగిం చాను. నిజానికి అతణ్ణి చంపాలని నా కోరికకాదు. పోరాట ఉధృతిలో అది గుండెల్లోకి చొచ్చుకుపోయింది."

"మోహన్‌రావును నువ్వు అంతకు ముందు ఎరుగుదువా ?"

"ఈ జన్మలో నేనతణ్ణి చూసిన పాపాన పోలేదండీ."

"నీమీద అతనికి పగవుండడానికి ఏమైనా కారణంవుందా ?"

"ఒకరినొకరం అసలే ఎరుగని పరిస్థితిలో కక్షకు అవకాశం ఏదండీ"

"సరే. మరొకమాట. నువ్వూ, లీలా కలిసి జాయింటుగా బ్యాంకు ఎకౌంటు పెట్టుకున్నారే. పెళ్ళికి ముందురోజున 2,000 రూపాయలు విత్‌డ్రా చేసి, లీల తీసుకొనడానికి కారణం ?"

"నేనే. అది నా డబ్బుకాదు. లీలదే. నెక్లేస్, గాజులు, గొలుసులు కొనుక్కుం టానంది. నేను నా దగ్గరవున్న డబ్బు ఇస్తానన్నాను. అంటే ఎవరిదగ్గర డబ్బ యితేనేం అంది. మెర్కెంటైల్ బ్యాంకులో నా ఎక్కౌంట్ వేరే వుందండీ."

"ఓహో ! అలాగునా ? మీ వినతల్లో ఎవరో, లీల నీ డబ్బు కాస్తా కాజేసి పారి పోయిందని అన్నది, విన్నానులే."

"అబ్బే అది శుద్ధ అబద్ధం. లీల తరహాయే వేరుసార్."

"సరే ! ఇంతకీ ఇప్పుడు కర్తవ్యం. ఇప్పుడు 11-30 అయింది. నీ వాలకం చూస్తే భోజనం చెయ్యనట్లే కనిపిస్తుంది?

అవునా ?" అని డిటెక్టివు అడగ్గా అతడు భోజనం చెయ్యలేదన్నట్లు తల పంకించాడు.

"సరే ఉండు. ఇప్పుడే వస్తా"నని అతడు మేడమీదికి వేళ్ళి ఒక ప్లేటులో నాలుగు చపాతీలు, ఒక కప్పులో పెరుగు, నాలుగు అరటిపళ్ళు తెచ్చి ఇచ్చాడు.

"ఇవి తీసుకో. ఆ గదిలో స్థిమితంగా పడుకో. ఉదయాన గడ్డం గీసుకొని, స్నానం చేద్దువుగాని. మా గిరీశుని బట్టలు ఇస్తా. నాతో చెప్పినదంతా పోలీసులతో చెప్పి పెయ్యి. నీకేమీ భయంలేదు నీ మీద హత్యాపరాధం ఎవరూ మోపరు. దేవుని దయవుంటే ఖైదుశిక్ష కూడా పడదు. నేను శాయశక్తుల సాయపడ తాను." అన్నాడు నరేంద్రలాల్.

"అయితే నేను మీతో చెప్పినదంతా పోలీస్ అధికారులతో చెబితే నమ్ముతారా?"

"ఎందుకు నమ్మరు ? నువ్వు చెప్పిన దానిలో అసంబద్ధమైనదేమీలేదే. మరేం భయంలేదు. సుఖంగా నిద్రపో" అని చెప్పి, కొంచెం సంతృప్తమైన మనస్సుతో నరేంద్రలాల్ మేడపైకి వెళ్ళి పడు కున్నాడు.

* * *

ఇన్‌స్పెక్టర్ మాధవమీనన్ ఆ నాడు తెల్లవారకుండా పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. చివరకు కాఫీ అయినా త్రాగలేదు పాపం. ఏం చేస్తాడు మరి ? నాలుగు నెలలు గాలించి, గాలించి పట్టు కొన్న ఒక గజదొంగ అమాంతంగా 'రిమాండ్'లోనుంచి ఎలాగో తప్పించుకు పారిపోయాడు. దానితో 'రెడ్డి వచ్చె మొదలాడ'మన్నట్లుంది.

ఏం చెయ్యడమా అని అతడు యోచి స్తుండగా ఫోన్ మ్రోగింది.

'ఎవరు బాబూ! తెల్లవారకుండానే' అనుకొంటూ మీనన్ 'హల్లో' అన్నాడు.

ఆ పిలిచినది నరేంద్రలాల్.

"ఏం పుట్టి మునిగిపోయిందని బాబూ రోజూ తొమ్మిది గంటలవరకూ రాని వాడివి తెల్లవారకుండానే స్టేషన్‌లో సాక్షాత్కరించా"వన్నాడు నరేంద్రలాల్

లాల్‌జీ కంపెనీలో ఆ మధ్య పది వేలరూపాయల చోరీ జరిగిందే - ఆ దొంగను అరెస్టుచేశాం జ్ఞాపకంవుందా ? వాడు రిమాండ్‌లోనుంచి తప్పించుకుని పారిపోయాడు భాయీ. మళ్ళా ఎన్ని తిప్పలుపడాలో వాడికోసం."

"సరే అదా నీ బెంగ ? నేనుకూడా సగం శ్రమపడతాను నీకోసం. కాని ఒక్క చిన్న విశేషం మన మిత్రుడు రామారావు దొరికాడు."

"ఏ రామారావు ?"

"జమాదార్ రామారావు పీటలమీది పెళ్ళి చెడిసిపోగా ఆశాభంగం పొందిన సైనికోద్యోగి. మధుర బంగళా హత్య కేసు మాట నేననేది."

"ఓహో! అతనా? సరే. ఉరి స్తంభానికి సిద్ధంగా వుండమను."

"పాపం. అదే భయపడుతున్నాడు. నిన్నరాత్రే ఇక్కడకు వచ్చాడు, జరిగినదంతా చెప్పాడు. అతనిని ఎలాగైనా బయటకు లాగాలి మనం. ఒక వాఙ్మూలం వ్రాయిస్తున్నాను. ఎవర్నైనా పంపిస్తే నీదగ్గరకు పంపిస్తాను."

"ఓ! ఇప్పుడే ముగ్గురు కానిస్టబుల్స్‌ను పంపిస్తా."

"ఇద్దరు సి. ఐ. డీ. లను, ఒక యూనిఫారంలోని పోలీసును పంపించు. సరే కాని డాక్టర్ జాన్సన్ రిపోర్టు చూశావా?"

"మైగాడ్! మన అంచనాలన్నిటినీ తారుమారుచేసింది భాయీ."

"మరేం భయంలేదులే. అన్నీ సర్దుకొంటాయి. కాని ఒక్క చిన్న పని చేసిపెడతావా?"

"తప్పకుండా నేనే వెళ్ళి చెయ్యవలసినదైతే చేస్తాను. నీ మాట త్రోసి వేస్తానా?"

"తప్పకుండా నువ్వే వెళ్ళాలి చాలా ముఖ్యం చూడు. గోపాలరావు వ్రాసిన మరణశాసనం రెండవది లేదూ, ఎవరో లాయర్ దగ్గర వుంది అన్నావు? దాని మీది నాయుడు సంతకాన్ని, అంతకు ముందు ఏవైనా కాగితాలలోని సంతకాలను సరిగా పోల్చి చూడాలి. ఎవరైనా హాండ్ రైటింగ్ ఎక్స్‌పర్టు వుంటేకూడా తీసుకువెళ్ళు."

"సరే. పూనమల్లి హైరోడ్‌లోనే వున్నాడొకాయన. ఆయన్ను తీసుకువెళ్ళి చూపిస్తాను. ఏమిటి నీ అనుమానం? ఫోర్జరీ అనేకదూ?"

"అనుమానం మాట తరవాత చెబుతాను. ఆ మరణశాసనంమీద ఎవరు సాక్షివ్రాళ్ళు చేసినది, ఎప్పుడు చేసినది? సాక్షుల ఎదటనే గోపాలరావు వ్రాలు చేసినది లేనిది తెలుసుకోవాలి."

"సరే. మరేమైనా విశేషాలు?"

"ప్రస్తుతానికి ఇవి చాలులే. కొత్తవి త్వరలోనే బయటపడగలవు." అన్నాడు నరేంద్రలాల్.

ఇనస్పెక్టర్ మాధవ మీనన్‌తో సంభాషించి, రిసీవర్ హూక్‌కు తగిలించిన మూడునిమిషాలకే నరేంద్రలాల్ గదిలోని ఫోన్ గణగణమంది.

ఈసారి మాట్లాడినది గిరీశుడు.

"ఏం అన్నా. ఇక్కడ విశేషాలు ఏమీ లేవు. వేణునాథ్ గువ్వపిట్టలా కిలకిల లాడుతున్నాడు. నన్ను ఏం చెయ్యమన్నావు? ఇంకా సైదాపేట వీధులలో తిరుగుతూనే వుండమన్నావా? రమ్మన్నావా?"

"సరే. నువ్వు ఓ టాక్సీలో వేణునాథును ఎక్కించుకొని మాధవమీనన్‌ను ఆఫీసు దగ్గరికి తీసుకురా! రానని పెంకితనంచేస్తే మళ్ళా నాకు ఫోన్

చెయ్యి. అక్కడి పోలీస్ ఇనస్పెక్టర్‌ను కొంచెం సాయపడమని చెబుతాను. బహుశా ఏమీ పేచీ పెట్టడను కొంటానులే."

"ఏమిటి బాబు ఆ ధైర్యం."

"ధైర్యం లేదు కనుకనే తిరస్కరించడంటున్నాను."

''టాక్సీ దొరక్క పోతే ఏం చెయ్యను ?''

"రైలుమీద తీసుకురా. కాని రైలులోనుంచి దూకకుండా మాత్రం చూడు. అతణ్ణి మీనన్‌కు వప్పగించి నువ్విక్కడికి రా."

''అయితే అతణ్ణి అరెస్టుచేసి తీసుకు రమ్మనా నువ్వనేది ?''

"కొన్నాళ్ళు కిల్పాక్ పిచ్చి ఆసుపత్రిలోగాని వుండాలని వుందా ఏమిటి నీకు. అతణ్ణి అరెస్టు చెయ్యడానికి నీకు అధికారం ఎక్కడుంది. ఓహో ! చదవకముందు కాకరకాయ అంటూ, చదివిన తర్వాత కీకరకాయ అన్నాట్ట నీ వంటి ప్రబుద్ధుడే."

"ఆగ్రహించకయ్యా మహానుభావా. నువ్వు చెప్పినట్లే చేస్తానులే.''

రిసీవరును హుక్‌కు తగిలించి నరేంద్రలాల్ తన డ్రెస్సింగ్ రూమ్ లోకి వెళ్ళి దుస్తులు వేసుకుంటూ వుండగా ఒక టాక్సీ వీధిలో ఆగిన శబ్దమయింది. తలుపు తెరుచుకొని లోపలకు ఒక్క విసురున ఒక వ్యక్తి వచ్చి "బాబూ ! బాబూ !" అని పిలిచాడు.

"వస్తున్నా, జయరాం. ఏం కారుల మీద తిరుగుతున్నావు? ఏమిటి ఛాన్స్." అంటూ నరేంద్రలాల్ హాలులోకి వచ్చిన సమయంలోనే, గిరీశుని దుస్తులు ధరించి రామారావు కూడా వచ్చాడు.

అతణ్ణి చూసి జయరాం సందేహాస్పదంగా ఎవరన్నట్లు చూచాడు.

''ఏం విశేష మేమన్నా–?"

"చాలా అర్జంటు సార్. అందుకుదా టాక్సీలో వస్తిని."

"అయితే పైకిరా." అని నరేంద్రలాల్ అతణ్ణి మేడమీదికి తీసుకు వెళ్ళాడు.

"మీరు చెప్పిందే నేను పోయి ఎగ్మూర్‌లో నాయుడు బంగళాను వాచ్ చేస్తూ వుంటిని. వంటవాణ్ణి చూస్తిని. నాయుడు భార్య ఇల్లె - ఆమె మోటార్ డ్రైవర్‌నుదాపట్టి, బలేగలాటా చేస్తుందాదంట. నిన్నరాత్రి డ్రైవర్‌ను మేడ మీదకి పిలిచి శానాసేపు ఏదో చెప్పిందట. వాడు రగస్యంగా విన్నాడు. నాయుడు బిడ్డను చంపివేయమనిదా చెప్పిందట. తండియార్పేటలో వెంకటాచారీ నర్సింగ్‌హోంలో వుందంట. పెరంబూర్‌లో కృష్ణారావ్ స్ట్రీట్‌లో ఒక మిద్దెవుండాదని, ఆ మిద్దెకు తీసుకుపోయి, అక్కణ్ణే సాపాటులేక మాడ్చి

చంపాలనీ చెప్పిందంట. ఎన్నివేల రూపాయి ఇచ్చిందో ఏమో - వాడు బయటవస్తూ జేబిలో నిండా పెద్ద నోట్ల పాకెట్ పెడుతోవున్నాడని వంటవాడు చెబుతాడు. వాడికి లీం అంటే ఎన్నామో అభిమానం. నేను మార్నింగ్ చూసిందే అంతా చెప్పి ఎట్లనో పిల్లను బ్రతికించ మనిదా రిక్వెస్టు చేశాడు. సామీ నాను ఆమె ఎప్పుడు బయటకు పూడ్సునా అని కనిపట్టి చూస్తిని. ఓ టాక్సీ పిలిచి ఇక్కడకుదా వస్తిని. రెండు అడ్రస్ మన దగ్గర వుంది. పోదాం రండి." అన్నాడు.

"జయరాం! మంచివార్త తెచ్చావు. ఇక మనకి టాక్సీ ఎందుకు, నా కారే వుందిగా. టాక్సీని పంపివెయ్యి." అని దబ్బిద్చాడు. ఇద్దరూ క్రిందికి దిగివచ్చే సరికి హాలులో సి. ఐ. డీ. పోలీసులు కూర్చుని వున్నారు.

"రామారావ్! నువ్వు వీరివెంట కమిషనర్ ఆఫీసుకు వెళ్ళు. ఇందాక వ్రాసిన వాఙ్మూలం ఇన్‌స్పెక్టర్ మాధవ మీనన్‌కు ఇయ్యి. నేను రెండు మూడు గంటలలో అక్కడికి వస్తాను. నీకు ఒక శుభవార్త చెప్పగలనేమో కూడా", అన్నాడు నరేంద్రలాల్.

పోలీసులకేసి చూసి "ఇదిగో, మీరు ముగ్గురూ ఇతణ్ణి సాయం పట్ట నక్కరలేదు. ఒక్కడు తీసుకు వెళ్ళ వచ్చు. మిగిలిన ఇద్దరూ నాతో రండి. కొంచెం జరుగురుపని వుంది" అన్నాడు.

యూనిఫారంలో వున్న పోలీసు రామారావును వాన్‌లో ఎక్కించుకొని వెళ్ళిపోగా నరేంద్రలాల్, జయరాం, ఇద్దరు సి. ఐ. డి. పోలీసులు-డిటెక్టివ్ కారులో బయలుదేరారు. స్టీరింగ్ దగ్గర నరేంద్రలాల్ కూర్చున్నాడు. జయరాం ప్రక్కనే వున్నాడు. వెనక సీట్‌లో సి. ఐ. డీ.లు ఇద్దరు కూర్చున్నారు.

నరేంద్రలాల్ తిన్నగా తండి యార్పేట హైరోడ్డుకు కారును పోనిచ్చాడు. పాతచాకలిపేటలో కొసను వుంది వెంకటాచారి నర్సింగ్‌హోం. కారును ఆ ప్రాంతంలో మెల్లగా పోనిచ్చాడు నరేంద్రలాల్.

నర్సింగ్‌హోం ఆవరణలో 'బ్యూక్ కారు' వుంది. "అది ఆవిడ కారే. ఆ కారులోనే ఆమె మధుర విజయంచేసింది" అన్నాడు డిటెక్టివ్.

తన కారును సుమారు ఒక నూరు గజాల ముందుకు పోనిచ్చి, రోడ్డు మలుపులో ఆపుచేశాడు. అయితే కారులో కూర్చున్నప్పటికి అక్కడి నర్సింగ్‌హోం ఆవరణ - ఎలా కాపు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒక పది నిమిషాలకు కారు తిరిగి బయలుదేరింది. ఒక సి. ఐ. డీ. ని అక్కడనే వుండి పోయి తాము తిరిగి వచ్చేలోపుగా నర్సింగ్‌హోంను ఒక కంట చూస్తూ

వుండమని చెప్పి నరేంద్రలాల్ తిన్నగా ఆ కారు వెనకనే తన కారును పోనిచ్చాడు. బేసిన్‌బ్రిడ్జి రోడ్డుమీదుగా-ఎల్‌ఫింట్ గేట్ పోలీసు స్టేషన్ - సాల్టుకొటార్స్ దాటి పెరంబూర్ హైరోడ్డు పట్టింది ఎలా కారు.

డ్రైవర్ మాంచి వేగంతో కారును పోనిస్తున్నాడు. మధ్య మధ్య బళ్ళు అడ్డురావడంతో నరేంద్రలాల్ కారే వెనకబడిపోసాగింది.

పెరంబూర్‌లో బకింగ్ హాం మిల్సుకు అవల ఒకటిన్నర ఫర్లాంగులలో 'ఎలా' కారు ఒక వీధిలోకి మళ్ళింది. నరేంద్ర లాల్ తన కారు వేగాన్ని తగ్గించి వేశాడు. మలుపు దగ్గర అగక మెల్లగా పోనిచ్చాడు. ఒకచోట కారు ఆగి వుంది. డ్రైవరు దిగాడు. బహుశా గేటు తాళం తెరవడానికి కాబోలు. తలుపులు తెరిచి, డ్రైవరు మళ్ళీ కారుఎక్కి లోపలకి పోనిచ్చాడు.

నరేంద్రలాల్ అప్పుడు తన కారును కూడా ఆ వీధిగుండానే పోనిచ్చాడు. సరిగా ఎలా కారు లోపలికి వెళ్ళినది. మేడ గేటుదగ్గరకు నరేంద్రలాల్ కారు వెళ్ళేసరికి ఆమె తలుపు దగ్గర నిలబడి వుంది. డ్రైవరు కారులోనుంచి ఏమో ఎత్తుకొని లోపలకు గొనిపోతున్నాడు. డిటెక్టివు తన కారును ముందుకు పోనిచ్చి మరొక ప్రక్కకు మళ్ళించాడు.

అయిదు నిముషాలలో 'ఎలా' వున్న కారు తిరిగి గేటుదాటి ఈవలకురావడం, డ్రైవరు యధాప్రకారం క్రిందకు దిగి గేటు తలుపులు బంద్ చెయ్యడం - కారు వచ్చిన దారినే తిరిగి పట్టడం జరిగింది.

వీధిలో ఒకరిద్దరు మనుష్యులు వస్తూ పోతున్నవారు తప్పితే మరే అలికిడీ లేక నిశ్శబ్దంగా వుంది.

డిటెక్టివు తన కారును తిన్నగా గేటు దగ్గరకి పోనిచ్చి ఆపాడు. జేబులో నుంచి ఒక పెద్ద తాళపుచెవుల గుత్తిని ఒక సన్నపాటి ఉక్కు తీగెముక్కను తీశాడు. ఒక్క త్రుటిలో తాళం ఊడి వచ్చింది. కారుతోసహా ముగ్గురూ లోపల ప్రవేశించారు.

డిటెక్టివ్ మేడ సింహద్వారానికి వున్న తలుపు తీయడానికి మాత్రం సుమారు అయిదారు నిమిషాలు పట్టింది. తలుపులు తెరిచి చూసేసరికి అక్కడ ఒక సోఫాలో ఒక ఇరవై ఏళ్ళ వయస్సు గల యువతి పడివుంది.

"ఈ అమ్మాయే లీల. ఈ దుర్మార్గులు ఈమెను కూడా చంపివేసివుందరు కదా!" అనుకున్నాడు. క్రిందికి వంగి చెయ్యిపట్టుకుని చూశాడు. ఆమె ముక్కు దగ్గర వ్రేళ్ళు వుంచాడు ఆమె శ్వాస తీస్తున్నది, నాడి కొట్టుకుంటున్నది కూడా. అయితే స్మృతి లేదు.

"అమ్మయ్య, బ్రతికాం. జయరాం, ఈమెను ఎత్తుకుని కారులో చేర్చు"

అన్నాడు. జయరాం, సి ఐ. డి. పోలీసు ఆమెను కారులోకి చేర్చగా, నరేంద్ర లాల్ తిరిగి తలుపులన్నీ బంధించి బయలుదేరాడు. పది నిమిషాలలో తన ఇంటి ప్రక్కనే వున్న ఒక డాక్టర్ ఆసుపత్రి దగ్గర కారు ఆపాడు. అతణ్ణి తాను బాగా ఎరుగును. లీలను డాక్టర్ ఆసుపత్రి లోనికి గొనిపోయి "డాక్టర్ జీ ! ఈ అమ్మాయి స్మృతి తప్పి వుంది. బహుశా మత్తుమందుగాని ఇచ్చి వుండవచ్చునేమో. కొంచెం ట్రీట్ చేసి, జాగ్రత్తగా చూడండి. పోలీస్ కేసు జరుగుతున్నది కూడా ఈ పిల్లను గురించి." అని చెప్పి, తిన్నగా తండియార్పేటలోని నర్సింగ్ హోంకు దారితీశాడు.

అక్కడకు చేరగానే సి. ఐ. డి. పోలీసు ఆ ప్రక్కనే వున్న మిలిటరీ హోటల్ నుంచి బయటకు వచ్చాడు.

"ఎవరో చిన్న డాక్టర్ ఆసుపత్రి సార్ ఇది. కంపౌండరు, నర్సు వున్నారు. అయన బెంగుళూరు వెళ్ళారట. ఎవరూ మందు పుచ్చుకొనడానికి వచ్చిన జాడ కూడా లేదు. నర్స్ బయటికి వెళ్ళి పోతోంటే— నేను పోలీసునని చెప్పి, వెళ్ళకుండా నిలిపివేశాను. రండి" అన్నాడు.

నలుగురూ లోపలకు వెళ్ళారు. నర్సును చూడగానే నరేంద్రలాల్ "ఓహో ! తమరా ! నేను జ్ఞాపకం వున్నానా, సిస్టర్" అన్నాడు.

నర్సు దుస్తులలోవున్నా ఆమెకు 30 లేక 35 ఏళ్ళు వుంటాయి. ఆమె డిటెక్టివు వంక కొరకొర చూసి, "ఎక్కడ చూశారు నన్ను" అంది.

"ఎందుకు సిస్టర్ అంత కోపం - మాజిస్ట్రేటు కోర్టులో చూశా. బీచ్ మరర్ కేసులో నువ్వు సాక్ష్యమివ్వ డానికి రాలే ?"

"దానికీ, ప్రస్తుతం మీరు ఇక్కడకు వచ్చిన పనికీ సంబంధం ఏమిటి ? ఆ అమ్మాయి నెవరో శ్రీనివాసన్ అనే లాయరుగారు తీసుకువచ్చి ఇక్కడ ప్రవేశపెటారు. ఒంట్లో బాగా లేదంటే మందులిచ్చి, మాకులిచ్చి సేవ చేశాం. ఆ అమ్మాయికి నిన్న, ఇవాళ ఫిట్స్ (మూర్ఛ) వచ్చాయి. పెద్ద ఆసుపత్రిలో చేరుస్తామని తీసుకుపోయారు ?"


"ఎవరు తీసుకువెళ్ళారు ? ఆ లాయరుగారేనా ?"

"కాదు, ఆ పిల్ల సవతి తల్లి."

నరేంద్రలాల్ జేబులోనుంచి ఒక ఫోటో తీసి ఆమెకు చూపి "ఈయనేనా ఆ అమ్మాయిని ఇక్కడకు తీసుకువచ్చి దిగబెట్టింది ?" అని అడిగాడు.

నర్సు ఆ ఫోటో చూసి 'అవు' నంది అన్నది.

"అయితే ఇతని పేరు మోహన్ రావు. నువ్వెవరవు బాబూ ! కంపౌం



తరువా ? నువ్వే చెబుతావు ?" అని అడిగాడు డిటెక్టివ్.

కాంపౌండర్ గాలిలో ఆకులా అల్లాడి పోయాడు. "నాకేమీ తెలియదు మహాప్రభో" అని భోరుమని ఏడ్చాడు.

ముప్ఫయ్ ఏళ్ళ ప్రాయంమించని - అయిదడుగులన్నర పొడుగుగల ఆ ఆసామీ అలా అమాంతంగా ఏడుస్తుంటే ఆ నలుగురిలో ఎవ్వరికీ జాలికలగలేదు సరిగదా నవ్వు వచ్చింది.

"ఏమిరా ! లాయర్ దగ్గర ఏమి తీస్తివి ? ఆ అమ్మ దగ్గర ఏమి తీస్తివి ? స్టేషన్‌కురామీ అక్కడనువ్వు-ఆడికూడ ఏడుస్తురుగాని" అన్నాడు ఒక సి. ఐ. డీ.

'మేమేం చేశామని అక్కడకు రావడానికి ?'' అంది నర్సు.

"అక్కడకు వచ్చి అడుగు మీ. ఊ ! లే.'' అన్నాడు కాన్‌స్టబుల్.

"వీళ్ళని మీనన్ దగ్గరకు తీసుకుపో" అని నరేంద్రలాల్ ఒక సి. ఐ. డీని సాయమిచ్చి పంపించాడు. తాను, జయరాం, ఒక సి. ఐ. డీ. కలిసి

తిన్నగా ఎగ్మూరులోని గోపాలరావు నాయుడు మేడదగ్గరికి వెళ్ళారు.

తలుపులోపల గడియ వేసివుంది. కారును పోర్టికోలో ఆపి, నరేంద్రలాల్ క్రిందకు దిగివచ్చి, తలుపుకట్టాడు

తలుపు తెరవబడినది. ఎదట డిటెక్టివుకు కనిపించినది ఇనస్పెక్టర్ మాధవమీనన్.

'గ్రాండ్ మిస్టర్ మీనన్, సినీమాలో శ్రీ కృష్ణభగవానుడిలా ఎక్కడపడితే అక్కడ ఎప్పుడుపడితే అప్పుడు సాక్షాత్కరిస్తున్నావే!'

'ఇలాంటి కేసుల సందర్భంలో మనం సర్వాంతర్యామిత్వం వహిస్తాం. రా. చిన్న సంగతి చెబుతాను.' అన్నాడు మీనన్,

''యజమానురాలు ఎలాదేవి ఏమయింది?'

"అదికకోసమే నయ్యా మేము ఇక్కడ నిరీక్షిస్తున్నాం నీ అనుమానం నిజమే అయింది లాయర్ దగ్గరకు దేవిడ్సన్‌ను తీసుకువెళ్ళి, నాయుడు వీలునామాను, మరికొన్ని పత్రాలలోని అతని చేవ్రాళ్ళను చూపించాడు. అతడు వాటిని పరిశీలించి, 'ముమ్మాటికీ ఫోర్జరీ' యే అన్నాడు.

నరేంద్రలాల్ ఇలా అన్నాడు.

"నేను నిన్న కొంతవరకు రహస్యాన్ని భేదించాను. నేడు మరింత ముఖ్యమైన కార్యాన్నే సాధించాను. అసలు గోపాలరావునాయుడు ఏ రోజు సాయంకాలం మధుర వెళ్ళాడని 'ఎలా' చెప్పిందో, ఆ రోజున ఇంటిలో వుండగానే చనిపోయాడు. విషప్రయోగం జరిగిందని జాన్సన్ చెప్పాడు. అతని మృతకళేబరాన్ని మాత్రమే మోహనరావు తీసుకువెళ్ళాడు మోహనరావు తన మోటార్ కారైతే అనుమానానికి అవకాశం వుంటుందని - మరామత్తుకు పంపాడు. తన కారు నతడు మరామత్తుకు నాలుగురోజుల క్రితం పంపాడని గిరీశు దన్నాడు. కాని ఒక్కరోజు క్రితమే పంపించినట్లు నేను సాగించిన దర్యాప్తులో బోధపడింది. ఆనాటి సాయంకాలమే మోహనరావు బయలుదేరలేదు. మరునాటి ఉదయం బయలుదేరాడు. 'హిల్మన్' కారులోనే నాయుడు మృతకళేబరం నాటి రాత్రంతా మోహనరావు ఇంటి గారేజీలోవుంది. రాయపేటలో అతని ఇంటి ప్రక్కనే ఒక న్యూస్ వెండర్ షాపువుంది. అతణ్ణి అడగ్గా ఆ రాత్రి ఎనిమిదిన్నర, తొమ్మిదింటికి, మోహనరావు మరొక కొత్త కారులో ఇంటికి వచ్చాడని, చెప్పాడు. అయితే అతడు మధుర చేరుకొన్ననాటి సగలే చెరువులో పడవేయలేదు నాయుడు శవాన్ని. భయపడో - లేక ఎవరైనా చూస్తారనో సందేహించి వుండాలి. ఆ రాత్రి పడవేసివుంటాడు. ప్రమాదవశాత్తు మరణించాడని అనుకొనడానికి వీలుగా

ఇలస్ట్రేటెడ్ వీక్లీ, చట్టలు అవీ ఆ నావలో పెట్టాడు. అది బలపడడానికి నెత్తిపై గాయమయ్యేటట్లు కొట్టినదీ అతడే."

ఇంకా ఏదో అడగాలని మాధవ మీనన్ అనుకుంటూ వుండగానే రంయిమని బ్యూక్ కారు వచ్చి ఆగింది. పోర్టికోలో మరోకారు వుండడం చూడగానే ఎలా కనుబొమలు ముడుచుకుపోవడం డిటెక్టివు స్పష్టంగా చూశాడు.

లోపల నరేంద్రలాల్‌ను, మీనన్‌ను, పోలీసు సి. ఐ. డీ.ని, జయరామును చూసి ఆమె నిర్విణ్ణురాలై "మీరంతా ఇక్కడికి ఎందుకు వచ్చారు?" అంది.

"మీ కోసమే' నన్నాడు మీనన్.

"నా కోసమే అంటే? నాతో ఏమైనా మాట్లాడవలసి వుందా?"

"అవును కాని ఇక్కడకాదు. కమిషనర్ ఆఫీసులో. మీరు మీ భర్తగారి హత్య సందర్భంలో కొంత సంజాయిషీ ఇవ్వవలసి వుంది. మర్యాదగా స్టేషన్‌కు రండి."

"ఆ సంజాయిషీ ఇక్కడనే అడగరాదూ? ఆయన ఆకస్మికంగా పోవడంతో అన్ని వ్యవహారాలూ అగమ్యంగా వున్నాయి. మేనేజరు చూస్తే ఇంకా ఎక్కడో నర్సింగ్‌హోంలో ఇదవుతున్నాడు. అన్నీ నేనే చూచుకోవలసి వస్తోంది" అంది ఎలా.

"కావచ్చు తల్లీ, మీరు చెప్పినదంతా అక్షరాలా నిజంకావచ్చు. కాని చట్టం ప్రకారం వర్తించడమే మా పని. 'సంజాయిషీ'కి అవసరమైన పరిస్థితులు ఏర్పడినపుడు అది జరగవలసినది పోలీస్ కార్యస్థానంలోనే! అప్పుడే దానికి ప్రయోజనం - అప్పుడే దానికి రక్తి కూడా."

నరేంద్రలాల్ ఆమెనుద్దేశించి "శ్రీమతీ : మీ అమ్మాయి లీల బ్రతికి వుంది. మీరు ఆ అమ్మాయికోసం ఎంతో బెంగగొనివుంటారు. ఎవరో దుర్మార్గులు పెరంబూర్‌లోని మా స్టోర్స్ మిద్దెలో పడవేసి వెళ్ళారు. ఆమెను సురక్షితమైనచోటుకు చేర్చాం" అన్నాడు.

ఎలా ముఖం వికృతమైపోయింది. ఆమె నోట మాటరాలేదు. అంతకంటె ఎక్కువగా ఆశ్చర్యపడినాడు మీనన్.

"ఏమోయ్ 722. ఆ డ్రైవర్‌ను అరెస్టు చెయ్యి. రా తల్లీ, రా. నువ్వు ఎంత అందంగా వుంటేనేం - లోపల హిమాలయపర్వతం ఎత్తున విషంపెంచుకొన్నావు. రా. చేసిన దుర్మార్గపు పనులకు ఫలితం అనుభవిద్దువుగాని." అన్నాడు నరేంద్రలాల్.

ఆమె మారు పలకలేదు. వారితో బయలుదేరింది.

* * *

ఇంచుమించుగా నెలరోజులు గడిచిపోయినవి. తనపై పోలీసులు చేసిన ఆరోపణలు ఏమీ నిజంకావనీ, తాను

పూర్తిగా నిర్దోషురాలననీ ఎలా వాదించింది. చివరకు పోలీసు ఉద్యోగులు గంటలతరబడిన సాగించిన అడ్డుపరీక్షల ఒత్తిడికి తట్టుకోలేకపోయింది. గుమాస్తాలు. వంటవాడు లీల ఇచ్చిన వాఙ్మూలాలు ఆమె ధైర్యాన్ని పూర్తిగా సడలించినవి. మాజిస్ట్రేట్ కోర్టులో విచారణ సాగింది. ఆ తర్వాత సెషన్స్ జడ్జి న్యాయస్థానంలో విచారణ ప్రారంభమయింది. ఇక తీర్పు చెప్పడమే తరవాయి అన్న ఘట్టంలో కేసు వున్నది. కేసు విచారణ సందర్భంలో డిటెక్టివు నరేంద్రలాల్ మెహతాకుగాని, సి. ఐ.డి. ఇన్‌స్పెక్టర్ మాధవమీనన్‌కుగాని తెలియని కొత్త విశేషాలు మరి కొన్ని బయటపడినవి.

'ఎలా' గోపాలరావు నాయుణ్ణి పెళ్ళి చేసుకొనడానికి పూర్వం మోహన్‌రావు ప్రేయసి. భార్యకాదు, అయితే ఎలా, గోపాలరావుల వివాహానంతరంకూడా ఎలా మోహనరావులమధ్య మైత్రి సాగుతునేవుంది. మోహనరావు గోముఖవ్యాఘ్రం. జిత్తులమారి. నాయుడుతో వ్యాపారం లావాదేవీలలో అప్పుడప్పుడు అతని ఇంటికి వెళ్ళేవాడు. నాయుడు సంపదను చూడగానే అతని కళ్ళు కుట్టినవి. ఎలాను సాధనంగా ఉపయోగించుకున్నాడు. తాను చెప్పినట్లు చెయ్యకపోతే ఆమె బ్రతుకు బయటపెడతానని బెదిరించేవాడు. పెళ్ళికి ప్రోద్బలించింది అతడే, టైపిస్టుగా ప్రవేశపెట్టింది అతడే.

లీల మార్గంలో తనకు ఎప్పటికీ అడ్డమేనని ఎలా గ్రహించింది, అందుకనే ఆమెతో కయ్యంపెట్టుకుని ఎలాగో బయటకు తోలివేసింది. అసలు లీలను ప్రపంచంనుంచే సాగనంపుదామని. మోహనరావు ఎత్తువేశాడు. ఆమె సెలవు మీద మదరాసు రావడం – రామారావు పెళ్ళిచేసుకొనడానికి యత్నాలు జరగడం అన్నీ కనిపెట్టాడు. ఎలాను ఉసికొల్పాడు. నాయుడుతో ఆమె లేనిపోనివి చెప్పి కోపం కలిగించింది.

ఆ క్రోధావేశంలో అతడు తాను ముందు వ్రాసినవీలును లాయర్ల ఎదటనే చించివేశాడు.

రెండవ మరణశాసనంపై తానే నాయుడు చేవ్రాలు ఫోర్జరీ చేశానని ఆమె ఒప్పుకుంది. మోహనరావు మారుపేరుతో ఒక సంతకం చేశాడు. గుమస్తా వెంకటేశ్వరన్ చెప్పిన సాక్ష్యంలో ఇది బయటపడింది. తన ఎదట నాయుడు సంతకం చెయ్యలేదని లోపల వున్నారని ఆమె అనగా తన యజమానిపైగల విశ్వాసంతో తాను సంతకం చేశాననీ, ఆమె బహుమానంగా వందరూపాయ లిచ్చిందనీ చెప్పాడు.

టెలిఫోచ ఎక్ఛేంజి ఉద్యోగ సాక్ష్యంలో ఎలా ఎప్పుడూ ట్రంక్‌కాల్ ఇమ్మని అడగనే లేదన్నాడు. విష

ప్రయాణానికి బాధ్యుడు మోహనరావు అని వాదించింది కాని నిరూపించలేక పోయింది.

లీల ఇప్పుడు తన తండ్రి భవనం లోనే వుంది. రామారావుకు శిక్ష పడు తుందేమో అన్న భయంతో - అతని తరఫున వాదించడానికి పెద్ద ప్లీడరును నియమించింది నరేంద్రలాల్‌తో తరచుగా సంప్రదించేది. ఆమెకు రామారావుపట్లగల ప్రేమాతిశయానికి నరేంద్రలాల్ అచ్చెరువు పొందాడు.

ఆమె కోర్టులో ఇచ్చిన సాక్ష్యం సందర్భాన తాను సెంబుదాస్ వీధిలో వున్నప్పుడుకూడా తండ్రి ఒకటి రెండు సార్లు వచ్చి చూసేవాడనీ -అయనే అద్దె ఇచ్చేవాడనీ చెప్పింది. నౌకాదళంలో పనిచేస్తున్న ఉద్యోగి తన పినతల్లి కుమారుడని వెల్లడించింది.

మోహనరావు ముందు తనతో చనవుగా మాట్లాడుతూ పరిహాసాలు ప్రారంభించాడనీ - ఒకటి రెండుసార్లు తండ్రితోపాటు తాను కాన్వెంట్‌లో వుండగా చూడటానికి వచ్చాడనీ - తాను అతణ్ణి ఏ క్షణాన చూశానో అప్పణ్ణుంచీ అసహ్యించుకొనే దానిననీ ఆమె నరేంద్రలాల్‌తో చెప్పింది.

సెషన్స్‌లో విచారణ పూర్తికాగా న్యాయమూర్తి తీర్పుచెప్పాడు. ఎలాకు యావజ్జీవ కారాగృహవాసం విధించ బడింది. ఎలాకు మద్దతు నిచ్చిన వేణునాథ్‌కు మూడేళ్ళు; డ్రైవరుకు ఏణ్ణర్థం, గుమస్తా వెంకటేశ్వరన్‌కు ఏణ్ణర్థం శిక్షలు విధించబడ్డాయి

శుభదినాన డిటెక్టివు నరేంద్రలాల్ గిరీశ్, ఇనస్పెక్టర్ మాధవమీనన్ల సమక్షంలో - బంధుమిత్రుల సన్నిధిని లీలా రామారావుల వివాహం యథాతథంగా జరిగింది.

(సమాప్తం)